తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం-06-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 101 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# ఎమ్మెల్యేలు కోరుకుంటే మళ్లీ రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రి

- వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలకు వెళతామన్న మహేశ్ కుమార్ గౌడ్
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళుతున్నామన్న టీపీసీసీ చీఫ్
- సీబీఐలో కొంత లొసుగులు ఉన్న మాట వాస్తవమేనని వ్యాఖ్య

2లో



# విద్యారంగాన్ని సమూలంగా మార్చేందుకు సిద్ధం

- విద్యా రంగంలో సమూల సంస్కరణలు అవసరం – సీఎం రేవంత్
- ఉస్మానియా యూనివర్సిటీ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం
- 55 రోజుల్లో 11 వేల టీచర్ల నియామకాలు పూర్తి
- "టీచర్లు బాగా పనిచేస్తేనే మేము మళ్లీ గెలుస్తాం" – సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరికలు పెరిగాయి
- పాఠశాలల మధ్యాహ్న భోజనంలో టీచర్లు కూడా పాల్గొనాలి – సూచన
- ప్రభుత్వ స్కూళ్లకే కార్పొరేట్ స్థాయి నాణ్యత లక్ష్యం

2లో



# యూరియా కోసం నడిరోడ్డుపై కొట్టుకున్న మహిళలు



- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహిళ రైతుల ఘర్షణ
- యూరియా కొరతతో రాళ్లదాడులు, నిప్పుపెట్టడం వరుస ఘటనలు
- వివేకానంద సెంటర్ వద్ద ఆగ్రోస్ కేంద్రంలో కలకలం
- జుట్టులు పట్టుకొని పొట్టుపొట్టు తన్నుకున్న మహిళలు
- ఆధార్ కార్డులు పట్టుకొని బారులు తీరిన రైతులు
- తోపులాట, ఉద్రిక్తతలతో రైతు సేవా కేంద్రం అల్లకల్లోలం

2లో

## మీతో పాటే నేను కష్టపడతాను

- నేను రెండోసారి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నా!
- గురుపూజోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని విమర్శ
- విద్యాశాఖలో సంస్కరణలు తీసుకు రావాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య

2లో



## ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకున్న ముఖ్యమంత్రి

- 71 ఏళ్లుగా వైభవంగా కొనసాగుతున్న ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవాలు
- దేశంలో ఎక్కడా లేని విధంగా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్
- 1.40 లక్షల విగ్రహాలతో ఘనంగా వినాయక నవరాత్రులు

2లో






## నేడు అర్ధరాత్రి 2గంటల వరకు మెట్రో రైళ్లు

- గణేశ్ నిమజ్జనాల కోసం మెట్రో ప్రత్యేక ఏర్పాట్లు
- సెప్టెంబర్ 6న ఉదయం 6 గంటలకు మొదటి రైలు
- సెప్టెంబర్ 7 తెల్లవారుజామున 1 గంటకు చివరి రైలు బయల్దేరుతుంది
- ఖైరతాబాద్, లక్డీకాపూల్ స్టేషన్లలో అదనపు సిబ్బంది
- రద్దీని దృష్టిలో పెట్టుకుని టికెట్ కౌంటర్లు పెంపు
- ప్రయాణికులు స్వీయ క్రమశిక్షణ పాటించాలన్న మెట్రో విజ్ఞప్తి

2లో

## కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుంది

- ధరణిని అడ్డుపెట్టుకొని వేల ఎకరాల భూములు కబ్జా చేశారు
- కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న గొడవలు ఆస్తికి సంబంధించినవే
- లింగాల గణపురం మండలం నవాబుపేట రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాట్ కామెంట్స్ చేశారు. కల్వకుంట్ల కుటుంబంలో జరుగుతున్న గొడవలు ఆస్తికి సంబంధించినవేనని ఆరోపించారు. శుక్రవారం జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం

మిగతా 2లో

## హైడ్రా పేరు చెప్పి.. రూ. 50 లక్షలు వసూలు!

- విషయం కమిషనర్ దాకా వెళ్లడంతో బయటపడిన నిజం
- పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

2లో



## నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు

- రాజ్యాంగంపై ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డికి తెలియదా?
- అబద్ధపు హామీలు, గారడీ గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీకి అలవాటే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు అనే విషయం.. అదే రాజ్యాంగంపై ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రేవంత్ రెడ్డికి తెలియదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. అబద్ధపు హామీలు, గారడీ గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి తమ చెప్పుతో తామే కొట్టుకునే దుస్థితి వచ్చిందని ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ తన గోసను వెల్లగక్కితే అక్రమ కేసుల పేరిట వేధిస్తారా..?

మిగతా 2లో



## బీఆర్ఎస్ పార్టీకి కేసీఆరే సుప్రీం

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ పార్టీకి అధినేత కేసీఆరే సుప్రీం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఉద్ఘాటించారు. ఎవరి విషయంలోనైనా నిర్ణయం పార్టీదేనని స్పష్టం చేశారు. లండన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడమే తనకు కేసీఆర్ నేర్పించారని నొక్కిచెప్పారు. మేడిగడ్డ మూడు పిల్లర్లు కుంగితే రేవంత్‌రెడ్డి సర్కార్ రాద్ధాంతం చేస్తోందని ధ్వజమెత్తారు. ఏడాదిన్నర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. వానాకాలంలో విద్యుత్ డిమాండ్ ఉండదని చెప్పుకొచ్చారు. ఆ సమయంలో బాహుబలి మోటార్లతో నీటిని ఎత్తిపోసుకోవచ్చని తెలిపారు. హైడ్రాతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని విమర్శించారు. ఎన్నారైలు తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు ఎందుకు పెట్టడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీష్‌రావు ప్రశ్నించారు.

## నేడు హైదరాబాద్‌లోకి ఆర్టీసీ బస్సులకు నో ఎంట్రీ..!

- ఎంజీబీఎస్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులను నగర శివారు ప్రాంతాలకే పరిమితం

**హైదరాబాద్ :** నగరం నలువైపులా నుంచి ట్యాంక్ బండ్, సరూర్ నగర్ చెరువులకు భారీ సంఖ్యలో గణనాథులు తరలివచ్చి గంగమ్మ ఒడికి చేరనున్నాయి.




2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# మీతో పాటే నేను కష్టపడతాను

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



"నాకు స్వార్థం ఉంది. ఉపాధ్యాయులు బాగా పనిచేస్తే నేను కూడా రెండోసారి ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నాను. అలాగని 'నేను ఫామ్ హౌస్‌లో పడుకుంటాను... మళ్లీ ముఖ్యమంత్రిగా చేయండి' అని నేను అడగడం లేదు. మీతో పాటే నేను కూడా కష్టపడతాను" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నూతన నియామకాలు లేవని ఆరోపించారు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం మూతపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. గురుపూజోత్సవానికి రావడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల కంటే నాణ్యమైన విద్యను అందిస్తామని అందరం ప్రతిజ్ఞ చేద్దామని అన్నారు. ప్రతి సంవత్సరం 200 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి అక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేసేలా ప్రోత్సహిద్దామని ఆయన అన్నారు. ఢల్లీలో కేజ్రీవాల్ రెండోసారి అధికారంలోకి రావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణమని వ్యాఖ్యానించారు. నేను కూడా విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని హామీ ఇచ్చారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని ముఖ్యమంత్రి అన్నారు. చాలాచోట్ల కేజీ టు పీజీ ఉచిత విద్య అందడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రసాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు.

ప్రతి గ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే అన్నారు. జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో గురుపూజోత్సవం జరిగిందా? అందులో ముఖ్యమంత్రి పాల్గొన్నారా? అని ప్రశ్నించారు.

# విద్యారంగాన్ని సమూలంగా మార్చేందుకు సిద్ధం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



విద్యారంగాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని, దీని కోసం ప్రతి ఒక్కరూ కలిసి నడవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రానికి సరికొత్త విద్యావిధానం రూపొందించేందుకే ప్రత్యేక అధ్యయన కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ రంగానికి మించిన నాణ్యతతో ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందించాలని కోరారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలకోపన్యాసం చేశారు.

గత పదేళ్లలో విద్యాశాఖ నిర్వీర్యమైందని, చారిత్రక ప్రాధాన్యత గల ఉస్మానియా యూనివర్సిటీ మూతపడే దశకు చేరిందన్నారు. విద్యాశాఖను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యా విధానంలో సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షించాలన్న ఉద్దేశంతోనే దానిని తన వద్ద ఉంచుకున్నానని సీఎం తెలిపారు.

దీనిపై కొంతమంది చేస్తున్న విమర్శలు అర్థం లేనివని కొట్టిపారేశారు. పదేళ్లుగా ఈ శాఖ అస్తవ్యస్తమైందని విమర్శించారు. ప్రొఫెసర్లను నియమించకుండా యూనివర్సిటీలను నీరుగార్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే టీచర్ల బదిలీలు, 55 రోజుల్లోనే 11 వేల మంది టీచర్ల నియామకాలు చేపట్టామని చెప్పారు.

**టీచర్లు బాగా పనిచేస్తే మేము మళ్లీ గెలుస్తాం**

తెలంగాణ ఉద్యమాన్ని పల్లెలకు తీసుకెళ్లిన ఘనత టీచర్లదేనని సీఎం అన్నారు. 'ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి ముఖ్యమంత్రి కావడానికి విద్యాభివృద్ధే కారణం. నాలోనూ ఆ స్వార్థం ఉంది. టీచర్లు బాగా పనిచేస్తేనే నేను రెండోసారి సీఎం అవుతాను. ఉపాధ్యాయ సంఘాలు ఎప్పుడొచ్చినా సమస్యలు విని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నా. ప్రైవేట్ కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువ విద్యావంతులు, సామాజిక బాధ్యత తెలిసినవారు. టీచర్లకు జీతాలిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు. మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. పాఠశాలల నిర్వహణకు ఏటా రూ.130 కోట్లు మంజూరు చేస్తున్నాం'అని తెలిపారు.

**విద్యార్థులతో కలిసి భోజనం చేయండి**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొన్నిసార్లు విషపూరితం కావటం దురదృష్టకరమని సీఎం అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలతో కలిసి ఉపాధ్యాయులు భోజనం చేయాలని కోరారు. అప్పుడే తప్పులు జరగకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు. అప్పుడప్పుడు తాను కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరికలు పెరిగాయని చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ కన్నా మంచి విద్యను అందిస్తామని టీచర్లు ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు.

# ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



హైదరాబాద్ నగర చరిత్రలో గడిచిన 71 సంవత్సరాలుగా ఎన్ని ఇబ్బందులు, కష్టాలొచ్చినా దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవాలను జరుపుతున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ఒకసారి చేయడమే కష్టమవుతున్న ఈ కాలంలో ఎన్ని ఉపద్రవాలొచ్చినా తట్టుకుని నిలబడి నిర్వహిస్తున్న ఖైరతాబాద్ గణపతికి పోటీ లేదన్నారు. హైదరాబాద్‌లో 1 లక్షా 40 వేల విగ్రహాలను ప్రతిష్టించుకుని ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గణేష్‌మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. భక్తుల మనోభావాలను గౌరవించే విధంగా నగరంలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖలు తోడ్పాటును అందిస్తున్నాయని చెప్పారు.

అన్ని మతాలను గౌరవిస్తూ హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్యాంక్‌బండ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, ప్రజలంతా భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్యేలు కోరుకుంటే మళ్లీ రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే ముందుకు సాగుతామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్ రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళుతున్నామని తెలిపారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, క్రమశిక్షణ విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరగాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీబీఐలో కొన్ని లోపాలున్న మాట వాస్తవమేనని ఆయన అన్నారు.

# నేడు అర్ధరాత్రి 2గంటల వరకు మెట్రో రైళ్లు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ మహానగర వాసులకు శుభవార్త.. గణేశ్ నిమజ్జనాలను కనులారా వీక్షించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ప్రజలకు అసౌకర్య కలగకుండా రవాణా సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 6వ తేదీన మొదటి రైలు ఉదయం 6గంటలకు మొదలుకుని అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు రాకపోకలు సాగిస్తాయని మెట్రో రైల్ అధికారులు తెలిపారు. అన్ని స్టేషన్ల నుంచి సెప్టెంబర్ 7వ తేదీ తెల్లవారు జామున 1 గంటకు చివరి రైల్ బయల్దేరి 2 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా బడా గణపతి ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్ర నేపథ్యంలో ఖైరతాబాద్, లక్డీకాపూల్ మెట్రో స్టేషన్లలో అదనపు సిబ్బందితోపాటు పోలీసులు, ప్రైవేటు సెక్యూరిటీతో పర్యవేక్షిస్తున్నామని హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు తెలిపారు. రద్దీకి అనుగుణంగా ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడిరచారు. ఖైరతాబాద్?కు వచ్చే మెట్రో ప్రయాణికులు స్వీయ క్రమశిక్షణ పాటించి మెట్రో భద్రతా సిబ్బందికి సహకరించాలనివిజ్ఞప్తి చేశారు. ఈ సేవలను భాగ్యనగర వాసులు వినియోగించుకోవాలని కోరారు.

# యూరియా కోసం నడిరోడ్డుపై కొట్టుకున్న మహిళలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

మహిళలు ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం పంచాయితీ పెట్టుకోవడం.. జుట్లు జట్లు పట్టుకొని కొట్టుకోవడం చూసాం కానీ యూరియా కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్న మహిళలు ఒక్క బస్తా కోస్టం కొట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నడిరోడ్డుపై మహిళ రైతులు శిఖలు పట్టుకొని తన్నుకోవడం సంచలనంగా మారింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో యూరియా కొరత తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తుంది.. పరస్పర దాడులకు కారణంగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిన్న రైతులు గ్రోమోర్ సెంటర్ పై రాళ్లదాడి చేసి అక్కడ నిప్పుపెట్టారు.. ఆ సంఘటన మరువకముందే శుక్రవారం మరో ఘటన జరిగింది. యూరియా విక్రయ కేంద్రం వద్ద ఇద్దరు మహిళ రైతులు శిఖలు పట్టుకొని పొట్టు పొట్టు తన్నుకోవడం కలకలం రేపగా.. ఇది వైరల్‌గా మారింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ లో ఆగ్రోస్ కేంద్రం వద్ద ఈ సీన్ జరిగింది.. యూరియా బస్తాల కోసం తెల్లవారుజామునుండే మహిళలు, రైతులు బారులు తీరారు.. ఈ క్రమంలో క్యూలైన్ లో ఇద్దరు మహిళా రైతుల వద్ద ఘర్షణ చెలరేగింది. ఇద్దరు మహిళలు జుట్లు జుట్లు పట్టుకొని పొట్టు పొట్టుగా కొట్టుకున్నారు. ప్రధాన రహదారిపై పొర్లాడుతూ కొట్టుకోవడం అందర్నీ విస్మయానికి గురిచేసింది. చుట్టుపక్కల వారు ఆపుతున్నా ఆగకుండా ఇద్దరూ పోట్లాడుకున్నారు. చివరకు ఇద్దరు వ్యక్తులు ధైర్యం చేసి ఆ ఇద్దరు మహిళలను బలవంతంగా ఆపారు. ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం ముందు మహిళలు, పురుషులు ఆధార్ కార్డులు జిరాక్స్ లు పట్టుకొని పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఒకరినొకరు నెట్టుకోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఈ సమయంలోనే ఇద్దరు మహిళలు తీవ్రంగా కొట్టుకున్నారు.

# కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుంది

(మొదటి పేజీ తరువాయి)

ఈనవాబుపేట రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులను దోచుకుందని విమర్శించారు. ధరణిని అడ్డుపెట్టుకొని వేల ఎకరాల భూములు కబ్జా చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించిందని ఆక్షేపించారు. వేల ఎకరాల భూములు, వేలకోట్ల రూపాయలు పంచుకునే క్రమంలో కేసీఆర్ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు కడియం శ్రీహరి. కేసీఆర్ కుటుంబ గొడవలతో తెలంగాణ ప్రజలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడానికి ప్రధాన కారణం కేసీఆర్ బిడ్డ లిక్కర్ కేసులో ఇన్వాల్వ్ అయినందుకేనని షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత లిక్కర్ కేసులో విచారణను ఎదుర్కోవడం అనేక రోజులు జైల్లో ఉండటం సరైన పద్ధతి కాదని తాను బయటకు వచ్చానని చెప్పుకొచ్చారు. అవినీతి డబ్బులను పంచుకోవడంలో వారి మధ్య జరిగిన గొడవే తప్పా.. మరి ఇంకా ఏం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు.





# నేడు హైదరాబాద్‌లోకి ఆర్టీసీ బస్సులకు నో ఎంట్రీ..!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి శనివారం ఉదయం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులను నగర శివారు ప్రాంతాలకే పరిమితం చేయనున్నారు. శంషాబాద్ మీదుగా బెంగళూరు, మహబూబ్‌నగర్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఆరాంఘర్ వద్దనే నిలిపివేయనున్నారు. వరంగల్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఉప్పల్ వద్ద, విజయవాడ, నల్లగొండ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఎల్‌బీనగర్ వద్ద నిలిపివేయనున్నారు. వికారాబాద్, మొయినాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను మెహిదీపట్నంకు పరిమితం చేయనున్నారు. కరీంనగర్, సిద్దిపేట, నిజామాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను జేబీఎస్‌లో నిలిపివేయనున్నారు. ఈరాత్రికి ఎంజీబీఎస్ చేరుకుని, మళ్లీ తెల్లవారుజామున తిరిగి వెళ్లే అంతర్ రాష్ట్ర, జిల్లా బస్సులను చాదర్‌ఘాట్ వైపు దారి మళ్లించనున్నారు.

# నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు

(మొదటి పేజీ తరువాయి)

అని ప్రశ్నించారు. యూరియా దొరకక కళ్ల ముందే పంట ఎండిపోవడంతో ఆక్రోశంలో మాట్లాడిన రైతుపై కక్షగట్టి అర్ధరాత్రి నుంచి పోలీసులను అతని ఇంటిపైకి పంపించి రైతు లక్ష్మణ్‌ను అతని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తారా..? దేశానికే అన్నం పెట్టే రైతుపై ఈ రకంగా అక్రమంగా కేసు బనాయించడం దుర్మార్గమైన చర్యే కాదు.. సీఎం దిగజారుడుతనానికి కూడా నిదర్శనం. ఇందిరమ్మ రాజ్యంలో బస్తా యూరియాకు దిక్కులేక అల్లాడుతున్న అన్నదాతలకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా, రాజ్యాంగాన్ని పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలె అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

పదేళ్లపాటు ఎన్నడూ లేని యూరియా సంక్షోభాన్ని తన చేతకానితనంతో సృష్టించిన రేవంత్‌పై కోపాగ్నితో రగిలిపోతున్న లక్షలాది రైతులపై కేసులు పెట్టే దమ్ము ఈ సర్కారుకు ఉందా..? పల్లెపల్లెనా ఈ సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్న రైతులందరిని అరెస్టు చేయడానికి ఈ పోలీసులు సరిపోరు. ఈ రాష్ట్రంలో ఉన్న జైళ్లు కూడా సరిపోవు. కడుపుకాలిన తెలంగాణ రైతులతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో రేవంత్ రెడ్డి, తన పాత గురువును అడిగి తెలుసుకుంటే మంచిది. ఇకనైనా ఈ అక్రమ కేసులు బనాయించి అమాయక రైతు లక్ష్మణ్‌ను వేధించడం మానుకోకపోతే, అతనికి రక్షణ కవచంగా బీఆర్ఎస్ ఉంటది. రాష్ట్రంలోని అన్నదాతలను బీఆర్ఎస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటది అని కేటీఆర్ తేల్చిచెప్పారు. జై కిసాన్.. జై తెలంగాణ.. అని కేటీఆర్ నినదించారు.

# హైడ్రా పేరు చెప్పి.. రూ. 50 లక్షలు వసూలు!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఇటీవల నగరంలో తరుచు వినిపిస్తున్న పేరు హైడ్రా. అక్రమ కట్టడాల కూల్చివేతకు సంబంధించి హైడ్రా పేరు బాగా హైలైట్ అయ్యింది. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారు.. తమకు హైడ్రా అధికారులు బాగా తెలుసని ఓ మహిళన మోసం చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. హయత్‌నగర్‌లో కొంతమంది ముఠాగా ఏర్పడి హైడ్రా అధికారులతో పనిచేయిస్తామని చెప్పి స్థానిక మహిళను ప్రలోభాలకు గురి చేశారు. హయత్‌నగర్‌లోని ల్యాండ్ ఇష్యూకు సంబంధించి సదరు మహిళ రూ. 50 లక్షలను ఆ ముఠాకు అప్పగించింది.

వివరాల్లోకి వెళితే.. హయత్‌నగర్‌లో ఉన్న ల్యాండ్ ఇష్యూపై హైడ్రాకు ఫిర్యాదు చేసింది ఓ మహిళ. ఇదే విషయాన్ని స్నేహితుల వద్ద కూడా చెప్పింది. అయితే తమకు హైడ్రా అధికారులు తెలుసని, ఈ విషయాన్ని తాము చూసుకుంటామని పలువురు వ్యక్తులు నమ్మబలికారు. దాంతో రూ. 50 లక్షలను ఆ మహిళను నుంచి తీసుకుంది ముఠా. ఇది హైడ్రా కమిషనర్ వరకూ వెళ్లడంతో అసలు విషయం బయటపడింది. దీంతో విచారణ చేయగా వారిపై పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు.

పరిధి విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా. ఫిర్యాదు చేయాలన్నా నేరుగా తమనే సంప్రదించాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వ హించే ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేయవచ్చని సూచిం చారు. హైడ్రా అధికారులు తమ బంధువులని, మిత్రులని, తమకు బాగా తెలుసంటూ ఎవరైనా చెబితే నమ్మి మోస పోవద్దని హెచ్చరించారు. హైడ్రాకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నా తనను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నప్రసాదం వితరణ

**చిల్కానగర్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్**

**చిల్కానగర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్‌లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతి వీధి, కాలనీ, బస్తీ గణనాధుల హర్షోల్లాసాలతో నిండిపోయింది. భక్తులు ఆధ్యాత్మిక ఉత్సాహంతో గణనాధుని దర్శించుకుంటూ, భజనలతో, హారతులతో మండపాలను కళకళలాడిస్తున్నారు.

ఈ సందర్భంగా చిల్కానగర్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పలు కాలనీల్లోని గణనాధులను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బీరప్ప గడ్డ, అన్నపూర్ణ కాలనీ, గణేష్ నగర్, బీరప్ప గడ్డ మస్జిద్ వెనుక వీధి, ఆనంద్ నగర్, వెంకటేశ్వర కాలనీ, చిల్కానగర్ గుట్టలో ఏర్పాటు చేసిన గణనాధుల వద్ద భక్తులతో కలిసి మంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించారు.తరువాత భక్తులకు అన్నప్రసాదాన్ని స్వయంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "వినాయక నవరాత్రులు ప్రజల్లో ఏకతా, ఐక్యత, భక్తి, భ్రాతృత్వాన్ని పెంపొందించే వేడుకలు. ప్రతి ఇంటికి ఆనందం, అభివృద్ధి కలగాలని గణనాధుని ప్రార్థిస్తున్నాను" అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, మహమూద్, ఫోటో బాలు, బింగి శ్రీనివాస్, శ్యామ్, బాలు బంటి తదితరులు పాల్గొన్నారు.వినాయక మండపాల వద్ద భక్తులు గణపతి బప్పా మోరియా నినాదాలతో ఉత్సవాలను మరింత వైభవంగా మార్చారు.





# నాయక్ నగర్ బంజారా కాలనీలో అన్నప్రసాద వితరణ

**కాప్రా డివిజన్, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ లో నాయక్ నగర్ బంజారా కాలనీ ఎన్ఎన్‌బీసీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో మేడ్చల్‌మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, కాలనీ అధ్యక్షురాలు పార్వతి నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విఠల్ నాయక్ మాట్లాడుతూ— "యూత్ అసోసియేషన్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయము. భక్తి శ్రద్ధలతో ప్రజలు వినాయక చవితిని జరుపుకోవాలని, సమాజానికి సేవ చేయడం ద్వారా ఐకమత్యాన్ని పెంపొందించుకోవాలని" అన్నారు.అలాగే వినాయక చవితి పర్వదినములలో అన్నప్రసాద వితరణ పుణ్య కార్యంలో భాగమయ్యే అవకాశం ఇచ్చినందుకు యూత్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కులమతాలకతీతంగా ప్రజాసేవలో యూత్ అసోసియేషన్ చురుకుగా వ్యవహరిస్తోందని, వారి సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో కాలనీ సభ్యులు వాణి, కోమ, బుజ్జి, బీన, సతీష్, సుమన్, బాలాజీ, నర్షిమ తదితరులు పాల్గొన్నారు.





# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు

**ఉప్పల్, సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ బుర్జులో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి గణనాధుని ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై కురవాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మిత్ర ఫ్రెండ్స్ రెడ్డి దేవేందర్ రెడ్డి మరియు పవనపుత్ర ఫ్రెండ్స్ సభ్యులు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. మండప కమిటీ సభ్యులు, స్థానిక యువకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొని గణనాధుని ఆశీస్సులు పొందారు.





# కుషాయిగూడలో పారిశ్రామిక వేత్తల ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ

**కుషాయిగూడ, సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు)** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ లో కుషాయిగూడ పారిశ్రామిక వేత్తల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉత్సవాలలో పాల్గొన్న భక్తులకు శ్రద్ధాభక్తులతో అన్నదానం నిర్వహించగా, ఐదువేల మందికి పైగా భక్తులు భోజనం చేశారు.ఈ సందర్భంగా అన్నదాతగా ముందుకు వచ్చిన ప్రముఖ పారిశ్రామిక వేత్త బొండాడ రాఘవేంద్ర రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఉత్సవాలు అనేవి భక్తులను ఏకం చేసి సద్భావనను పెంపొందించే వేదికలని పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం చేయడం అనేది మహా పుణ్యకార్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కాకుమాను కిషోర్, వెంకట రమణ, కింగ్స్ బాబు, ఎం.ఎస్.ఎన్. రాజు, మధు, హైటెక్ బాబు, కే.డి.ఎస్. నరేందర్, యూ.ఎస్.ఎన్. మూర్తి, సుధాకర్, శివ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే మాజీ కార్పొరేటర్ కొత్త రామరావు, నాయకులు కాసం మహిపాల్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు హాజరై భక్తులను ఉత్సాహపరిచారు.

అసోసియేషన్ తరఫున నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది గణేష్ ఉత్సవాల్లో భక్తులకు అన్నప్రసాదం వితరణ తమ సంప్రదాయమని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించడానికి కృషి చేస్తామని తెలిపారు.



## సగర సంఘం వినతిపత్రం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హామీ

**మౌలాలి, సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి నియోజకవర్గం మౌలాలి 138వ డివిజన్ శ్రామికనగర్‌లోని సగర (ఉప్పర) సంఘం కమిటీ సభ్యులు, బంధుమిత్రులు కలిసి శుక్రవారం మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి మైనంపల్లి హనుమంతరావు దూలపల్లి నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం తరఫున కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు ప్రభుత్వం నుండి కేటాయించవలసిందిగా వినతి పత్రం సమర్పించారు. మైనంపల్లి హనుమంతరావు సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని, "నా తరఫున పూర్తి సహకారం అందిస్తాను" అని హామీ ఇచ్చారు.గతంలో బీసీ బందు పథకం కింద సగర కులస్తుల 13 మందికి రూ.13 లక్షలు మంజూరయ్యేలా చేసినట్లు గుర్తుచేస్తూ, అదనంగా సంఘ కార్యాలయంలో తన సొంత ఖర్చుతో రూ.2 లక్షలు వెచ్చించి బోరు వేయించిన విషయం ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది.ఈ కార్యక్రమంలో సగర సంఘం అధ్యక్షులు ఎర్రంశెట్టి ఆంజనేయులు సగర, ప్రధాన కార్యదర్శి క్యాసాన్ని వెంకటస్వామి సగర, కోశాధికారి మోడల శ్రీనివాసగర, కృష్ణ సగరతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, భరత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు మంద భాస్కర్, సీనియర్ రిపోర్టర్ వెంకటేష్, సాయి చందు, సాయిలు సగర, బుద్ధుడు సగర, లక్ష్మీనారాయణ సగర, వెంకటేష్ సగర, శేఖర్ సగర, గోవర్ధన్ సగర, నరసింహ సగర, నారాయణ సగర, వేముల శ్రీనివాసగర, టైల్స్ వెంకటేష్ నగర పాల్గొన్నారు.



## నాగారంలో గణనాధుని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఘనంగా

**నాగారం, సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు)** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంలో నాగారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలలో గణనాధుని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసిన ఈ కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, నాగారం మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక అతిథులుగా విచ్చేసి అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. భక్తులందరికీ స్వయంగా అన్నదానం చేస్తూ వారితో కాసేపు మమేకమయ్యారు. ముప్పు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "వినాయక నవరాత్రి ఉత్సవాలు కేవలం పూజలకే పరిమితం కాకుండా సామాజిక సౌహార్దాన్ని, సోదరభావాన్ని పెంపొందించే వేదికలు" అని పేర్కొన్నారు. సమాజంలో సేవా భావం పెంపొందించడానికి ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "అన్నదానం మహా దానం. గణనాధుని ఆశీస్సులతో ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో నిండిపోవాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.అనేక కాలనీలలో ఏర్పాటు చేసిన మండపాల్లో భక్తులు గణనాధుని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి, అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. చిన్నా, పెద్దా భక్తులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## సోనియా గాంధీ నగర్‌లో బొజ్జ గణనాథుని అన్నప్రసాదం

**చర్లపల్లి, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ లో సోనియా గాంధీ నగర్ కాలనీ పేజ్ వన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొజ్జ గణనాథుని అన్నప్రసాద కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్, మేడ్చల్ జిల్లా పరిషత్ సభ్యుడు ఇస్లావత్ హరినాయక్ విచ్చేసి భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ ప్రభాకర్ "వినాయక నవరాత్రులు ప్రజల్లో ఆధ్యాత్మికత, సానుభూతి, సేవా భావనను పెంపొందించే వేడుకలు. గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలి. అన్నదానం చేయడం అత్యున్నతమైన పూజ" అని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షుడు శ్యామల బిక్షపతి, ఉపాధ్యక్షుడు పారుపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుల గోపాల్, కోశాధికారులు చింతల వెంకటేశ్వర్లు, మోడం రాజు, సంయుక్త కార్యదర్శి కలమంట శ్రీనివాస్, కమిటీ సభ్యులు మైలారం బాల నర్సింహ, ఉంగరాల మహేందర్, కిట్టు యాదవ్, కొండ సత్యనారాయణ గౌడ్, మహేందర్, వెల్డింగ్ శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండపంలో గణనాథుని ప్రత్యేక అలంకరణ, భక్తుల కోలాహలం, సాంస్కృతిక కార్యక్రమాలతో వాతావరణం ఉత్సాహభరితంగా మారింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : హొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# సత్తుపల్లిలో రాధాకృష్ణన్ జయంతి వేడుకలు!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 05(తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ రాష్ట్రపతి, విశిష్ట విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాధాకృష్ణన్ ఒక సాధారణ అధ్యాపకునిగా ప్రారంభించి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదగడం ప్రతి ఉపాధ్యాయుడి గర్వకారణం అని అన్నారు. గురువులు, విద్యార్థుల మధ్య ఉన్న బంధం ఒక కుటుంబ సంబంధం లాంటిదని, గురువు చూపే మార్గం విద్యార్థి జీవితానికి వెలుగుల దీపమని తెలిపారు. నిజమైన ఉపాధ్యాయుడు జ్ఞానం మాత్రమే కాకుండా, విలువలు కూడా బోధించి సమాజ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తాడని గుర్తు చేశారు.

నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ కలిసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షురాలు తోట సుజాలరాణి గణేష్, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు కమల్ పాషా, ఐ.శ్రీను, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# నేడు మంగంపల్లికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాక



**పెద్దమందడి,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో శనివారం నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలకు తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవనున్నారని వెల్టూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు వెల్టూరు గ్రామం ఎన్‌హెచ్ 44 రోడ్డు దగ్గర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం వెల్టూరు నుండి మంగంపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మంత్రిని ఆహ్వానించనున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ పెద్దలు, మహిళలు, యువకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ పిలుపునిచ్చారు.



# ఆంజనేయులకు కన్నీటి వీడ్కోలు పలికిన స్నేహితులు

## మిత్రుని తల్లికి ₹45 వేల సహాయం చేసిన 1996–97 పూర్వ విద్యార్థులు

**పెద్దమందడి,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి జిల్లా పరిషత్ పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ బాల్య మిత్రుడు అల్వాల గ్రామానికి చెందిన ఆంజనేయులు మృతితో మమేకమై సహృదయాన్ని చాటారు. గురువారం అనారోగ్యంతో ఆయన మృతి చెందగా, ఈ వార్త తెలిసి పూర్వ విద్యార్థులు తీవ్రంగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆంజనేయుల కుటుంబ ఆర్థిక ఇబ్బందుల విషయాన్ని వాట్సాప్ గ్రూప్‌లో పంచుకున్న వెంటనే స్నేహితులు స్పందించారు. కేవలం గంటల వ్యవధిలోనే రూ.45 వేల రూపాయలు సేకరించి చిన్నమందడి గ్రామానికి చెందిన నందనమోని గోవర్ధన్ ఖాతాకు ఫోన్‌పే ద్వారా పంపించారు.

శుక్రవారం అల్వాల గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు పూర్వ విద్యార్థులు హాజరై మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయుల తల్లి నరసమ్మకు సేకరించిన రూ.45 వేల రూపాయలు అందజేసి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా బాల్య మిత్రులు మాట్లాడుతూ - "సంక్షోభ సమయాల్లో ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం" అని సంకల్పం వ్యక్తం చేశారు. ఆపదలో అండగా నిలిచిన వారిలో గోవర్ధన్, ప్రవీణ్, కొండన్న యాదవ్, కురుమన్న, ఆనంద్, శశికళ, వాకిటి రమేష్, ఈ.గోవర్ధన్, సరస్వతి, రవికుమార్ గౌడ్, ఎన్.కురుమూర్తి, లక్ష్మీకాంత్ రెడ్డి, పెద్దబాల్ రెడ్డి, రాజు, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

# నాచారం అంబేద్కర్ నగర్ గణేష్ మండపం లో ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు



**నాచారం, సెప్టెంబర్ 05(తెలంగాణ ముచ్చట్లు) :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం నాచారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొమ్మగాళ్ల నవీన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద గణనాథుని విగ్రహాన్ని ప్రతిష్టించి భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేసి గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ "వినాయకుడి ఆశీస్సులతో దేశం అభివృద్ధి చెందాలి. ప్రతి ఇంటిలో సంతోషం నెలకొని, ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలి" అని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని, అందరు కలిసి శాంతి, సౌహార్ద వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో నిర్వాహకులు గౌడెల్లి రామకృష్ణ, గౌడెల్లి శ్రీనివాస్, ఏర్పుల నర్సింగ్ రావు, ఏర్పుల నాగరాజు, రవి, విశాల్, అరుణ్, సాయి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు అనిత పద్మారెడ్డి, మల్కా ప్రకాష్, కాటేపల్లి రవీందర్ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, వెంకట్ నాయక్, సాయి గౌడ్, దయానంద్ గౌడ్, నవీన్ గౌడ్, అమర్నాథ్, బాలకృష్ణ, కిషోర్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం స్థానిక భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి గణనాథుని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేసి సేవ చేశారు.

# నిమజ్జనానికి బయలుదేరిన గణేశుడు



**పెద్దమందడి,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలోని ఛత్రపతి శివాజీ కాలనీలో గణేశ నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయి. తొమ్మిది రోజుల పాటు గణపతి బప్పాకు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించగా గ్రామం అంతా పండుగ వాతావరణంలో కళకళలాడింది. శుక్రవారం నాడు భక్తులు ఘనంగా ఊరేగింపుగా గణేశుడిని నిమజ్జనానికి బయలుదేరారు. డప్పుల మోత, నృత్యాల సందడి, "గణపతి బప్పా మోర్యా" నినాదాలతో వాతావరణం మార్మోగిపోయింది. గణేష్ శోభాయాత్రలో పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొని ఉత్సవాన్ని మరింత వైభవవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి, బిజెపి మాజీ మండలాధ్యక్షులు రమేష్, తిరుపతయ్య, సుద్దబాయి శీను, ముష్టి వెంకట్రాములు, యాదయ్య, ముష్టి శ్రీనివాసులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొని గణపతికి ఘనంగా వీడ్కోలు పలికారు.





# అబ్బురపరుస్తున్న గణనాధుడు.!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు ):** వేంసూరు మండల పరిధిలో మర్లపాడు గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వినాయక నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో గ్రామం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. శుక్రవారం నిర్వహించిన మహాన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల పల్లెల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. చిన్నా-పెద్దా తేడా లేకుండా భక్తులు అందరూ వినాయకుని సేవలో నిమగ్నమై సత్సంగ వాతావరణాన్ని ఆస్వాదించారు.

నిర్వాహకులు నడిపల్లి వాసుదేవరావు (చిన్నబుజ్జి) మాట్లాడుతూ శనివారం స్వామి వారి నిమజ్జనోత్సవాన్ని మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలో శక్తివంతమైన డప్పుల వాద్యాలు, సాంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చెప్పారు.ఈసారి ఏర్పాటు చేసిన గోవుపై వినాయకుడి విగ్రహం భక్తులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. శిల్పకళా నైపుణ్యంతో రూపొందించిన ఆ విగ్రహం ముందు భక్తులు ఫోటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నిండా వినాయక భజనలు, మంత్రోచ్చారణలతో గంభీరంగా మార్మోగి పండుగ వాతావరణం అలరారుతోంది.



హన్మకొండ జిల్లా తాటికాయలలో నిమ్మజ్జనం చేసేందుకు గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు

# ట్రంప్ పాలన ఆసియా శక్తులను అణగదొక్కాలని చూస్తోంది..

చైనా వేదికగా జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలనపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఆసియాలోని రెండు అతిపెద్ద శక్తులు అయిన భారత్, చైనాలను అణగదొక్కేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. పుతిన్ వ్యాఖ్యానంలో, ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ టారిఫ్‌లు (ఆంక్షలు) అనే సాధనాన్ని ఆయుధంలా ఉపయోగిస్తోందన్నారు. ఇది ఆర్థిక ఒత్తిడి ద్వారా ఆయా దేశాలపై ప్రభావం చూపించాలనే వ్యూహంగా ఆయన పేర్కొన్నారు. తాము భాగస్వాములు అనే మాటలు చెప్పినా, ఆ చర్యలు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. భారత్, చైనాలు తమ స్వతంత్రతను నిలుపుకోవడంలో మరింత చురుకుగా ఉండాలని పుతిన్ సూచించారు. అమెరికా విధానాలు వీటిని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉన్నాయని ఆయన అభిప్రాయం. ప్రపంచంలో శాంతి, సమతుల్యతను కాపాడాలంటే ఇలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ఆ దేశాలు దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. పుతిన్ వ్యాఖ్యలు అమెరికాఆసియా దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ, ఆర్థిక ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గాజా వేదికగా భారతదేశం, చైనా వంటి దేశాలకు మద్దతుగా నిలబడిన ఆయన, రష్యా తన భౌగోళిక, రాజకీయ ధోరణిలో స్పష్టత చూపుతోందని సూచించారు. ఇది భవిష్యత్తులో అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది.



# భారత్ ధ్వంసం చేసిన నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ పునర్నిర్మిస్తోన్న పాక్

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ధ్వంసం చేసిన నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌ను పాకిస్థాన్ పునర్నిర్మిస్తున్నట్టు ఉపగ్రహ ఫోటోలు బయటపెట్టాయి. ఇస్లామాబాద్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నూర్ ఖాన్ పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన అతి ముఖ్యమైన స్థావరం.మే 10 తేదీ తెల్లవారుజామున భారత్ జరిపిన క్షిపణి దాడిలో నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ ధ్వంసమైంది. అక్కడ ఉన్న రెండు ప్రత్యేక ట్రక్కులను టార్గెట్ చేసుకుని క్షిపణి దాడి చేసింది. డ్రోన్ కమాండ్, నియంత్రణ కోసం వినియోగించే వ్యవస్థలు, రెండు ట్రక్కులు ఈ దాడిలో ధ్వంసమయ్యాయి. నూర్ ఖాన్ వైమానిక స్థావరంపై భారత్ ఏరకం క్షిపణులతో దాడిచేసిందనేది మాత్రం ధ్రువీకరించలేదు. కానీ, బ్రహ్మోస్ లేదా స్కాల్ప్ క్షిపణులు లేదా రెండిరటినీ ప్రయోగించడం వల్లే ఎయిర్‌బేస్ ధ్వంసమైనట్టు భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్‌ను భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్30 యుద్ధ విమానాల నుంచి, స్కాల్ప్‌లను ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన రాఫెల్ నుంచి ప్రయోగించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ సైన్యం చేపట్టి, పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తీవ్రవాద శిబిరాలపై దాడిచేసింది. దీంతో ఇరుదేశాల మధ్య సైనిక ఘర్షణలు తలెత్తి.. నాలుగు రోజుల పాటు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగాయి. ఇరు దేశాలూ కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించడంతో సాధారణ పరిస్థితులు నెలకున్నాయి. ఇక, నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడికి ముందు, తర్వాత పరిస్థితులను ఉపగ్రహాలు తీసిన ఫోటోలు బయటపెట్టాయి. తాజాగా, ఆ వైమానిక స్థావరాన్ని పాక్ పునర్నిర్మిస్తోన్నట్టు తాజాగా తీసిన ఫోటోలు వెల్లడిరచాయి. ప్రముఖ జియో ఇంటెలిజెన్స్ నిపుణుడు డామియన్ సిమోన్ మాట్లాడుతూ.. ''మే 10న భారత్ క్షిపణి దాడిలో ధ్వంసమైన నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ పునర్నిర్మాణాన్ని పాకిస్థాన్ మొదలుపెట్టింది.. ఆ వైమానిక స్థావరంలోని ఒక చోట ఉంచిన ప్రత్యేక సైనిక వాహనాలను భారత్ లక్ష్యంగా చేసుకోవడంతో అవి ధ్వంసమయ్యాయి.. పక్కనే ఉన్న భవనాలకు నష్టం వాటిల్లింది. తత్ఫలితంగా అంతర్గత వ్యవస్థలు దెబ్బతిన్నాయి.. దాడితో నిర్మాణాలు బలహీనపడటంతో చుట్టుపక్కల ఉన్న అనేక వాటిని కూల్చివేశారు'' అని అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక









# శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచలో ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి...

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5, తెలంగాణ ముచ్చట్లు:**

చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ గ్లోబల్ హై స్కూల్ విద్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5 న మనం ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం ఈరోజు భారతదేశపు మహా తత్వవేత్త ,విద్యావేత్త, మరియు రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి. ఒకప్పుడు ఆయన శిష్యులు మీ పుట్టినరోజును జయంతిగా జరుపుకుందాం అని అడిగినప్పుడు ఆయన "నా పుట్టినరోజును గురువుల దినోత్సవం గా జరుపుకుంటే నాకు మరింత ఆనందంగా ఉంటుంది అని అన్నారు ".అప్పటి నుండి ఈరోజు ఉపాధ్యాయ దినోత్సవం గా దేశమంతా జరుపుకోవడం జరుగుతుందని, గురువులు మనకు విద్యనే కాకుండా విలువలు, క్రమశిక్షణ ,నైతికత నేర్పిస్తారని తల్లిదండ్రులు మనకు జీవాన్ని ఇస్తారని ,గురువులు ఆ జీవితాన్ని సార్థకం చేయడానికి మార్గం చూపిస్తారని, కాబట్టి గురువులు మన రెండవ తల్లిదండ్రులని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. అదేవిధంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థిని విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ ఉన్నత స్థానాలకు ఎదిగేలా చూస్తూ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కూడా ఉన్నతమైన స్థానాలను అవరోదించాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ వాహిని, సుధాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి ,పాఠశాల ప్రిన్సిపల్ తన్నీరు రామారావు ,పాఠశాల వయసు ప్రిన్సిపల్ చాపలమడుగు తిరుపతిరావు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



# కోర్టు డ్యూటీ పోలీసులకు సీపీ సన్ ప్రీత్ సింగ్ ప్రశంస

**ధర్మసాగర్,సెప్టెంబర్05(తెలంగాణ ముచ్చట్లు):**




హనుమకొండలోని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు పోలీసులు తమ విధుల్లో ప్రతిభ కనబరచి కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందుకున్నారు.ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన ఆలకుంట రాజు తన భార్యను హత్య చేసిన కేసులో పోలీసులు 18 మంది సాక్షులను కోర్టుకు హాజరుచేసి న్యాయస్థానం ముందు వాంగ్మూలాలు నమోదు చేయించారు. అనంతరం జిల్లా జడ్జి నిందితుడికి ఎనిమిది సంవత్సరాల శిక్ష విధించారు.

ఈ కేసులో బాధ్యతాయుతంగా వ్యవహరించి నిందితుడికి శిక్ష ఖరారు కావడంలో కీలకపాత్ర పోషించిన కోర్టు కానిస్టేబుల్ జన్ను రమేష్, కోర్టు ప్రాసెస్ డ్యూటీ హోంగార్డ్ అంబటి సుధాకర్ రాజును సీపీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి ప్రశంస పత్రాలను అందజేస్తూ ఇకపై కూడా ఇలాగే కర్తవ్య నిష్ఠతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంలో ధర్మసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ నరసింహారావు, పోలీసులు అభినందనలు తెలిపారు.





# సత్తుపల్లిలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 05(తెలంగాణ ముచ్చట్లు):**


సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన మట్టా దంపతులు వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ విద్యారంగ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంఇఓ అధికారులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలు గణనీయమైన అభివృద్ధి సాధించాయని, ఉపాధ్యాయుల సూచనలకు పూర్తి సహకారం అందుతున్నదని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో డైట్ చార్జీలు, క్యాస్మోటిక్ చార్జీలు పెంచడం వలన విద్యార్థులు మంచి ఆహారం, నాణ్యమైన చదువు పొందుతున్నారని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. పాఠశాలలు తెరవగానే పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు ఒకేసారి అందజేయడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన గొప్ప పని అని ఉపాధ్యాయులు ప్రశంసించారు.

పాఠశాల చిన్నారుల భవిష్యత్తు బంగారు భవితగా తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయుల కృషి అపూర్వమని మట్టా దంపతులు అభినందించారు. సమాజానికి మంచి పౌరులను అందించే విధంగా వారి సేవలు విశేషమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఐదు మండలాల ఎంఇఓలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, సత్తుపల్లి పట్టణ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మోదీ, పుతిన్, జిన్‌పింగ్ కలయికతో అమెరికన్ల వెన్నులో వణుకు

షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సు సాక్షిగా అమెరికాకు భారత్, చైనా, రష్యా, బలమైన సందేశం పంపాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ , ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కలిసి ఉన్న ఒక ఫోటో ప్రపంచవ్యాప్తంగా చర్చకు తెరతీసింది. ప్రపంచంపై ఆసియా ఆధిపత్యం చెలాయించబోతుంది అనడానికి ఇది సంకేతామని అంటున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాధిత దేశాధినేతలు ఒకే వేదికపై నవ్వులు పంచుకుని, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న ఫోటోలు పశ్చిమ మీడియా దృష్టిని ఆకర్షించారు. అమెరికాకు చెందిన రాజకీయ విశ్లేషకుడు వాన్ జోన్స్ మాట్లాడుతూ.. ఈ దృశ్యాలు 'ప్రతి అమెరికన్ వెన్నులో చలి పుట్టించే'లా ఉన్నాయని అన్నారు. జోన్స్ సీఎన్ఎన్‌తో మాట్లాడుతూ... 'ఈ రోజును చారిత్రాత్మకంగా చాలా పెద్ద మలుపుగా గుర్తుంచుకుంటాం.. ఎందుకంటే ఆ ఫోటోలో భారత్ ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్‌లతో షీ జిన్‌పింగ్ కలిసి ఉన్న ఫోటో ప్రతి అమెరికన్ వెన్నులో చలి పుట్టించే అంశం' అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశాన్ని 'నూతన ప్రపంచ వ్యవస్థ' కు సంకేతంగా ఆయన అభివర్ణించారు. ఎస్సీఓ సదస్సులో వ్లాదిమిర్ పుతిన్, నరేంద్ర మోదీలు చేతిలో చేయివేసుకుని నవ్వుకుంటూ.. జిన్‌పింగ్ వద్దకు రాగా..., తర్వాత ముగ్గురూ గ్రూప్ ఫోటో దిగారు. ''ఒకప్పుడు ఇలా అమెరికా, చైనా, రష్యా మాత్రమే ఉండేవి. ఇప్పుడు మనం అందులో లేము.. అందరూ మనకు వ్యతిరేకంగా ఉన్నారు. అది అమెరికాకు మంచిది కాదు'' అని ఆయన అన్నారు. వాషింగ్టన్ పోస్ట్ ప్రకారం.. అమెరికా వ్యతిరేక వర్గంగా ముద్రపడిన నాలుగు దేశాలైన ఇరాన్, ఉత్తర కొరియా, చైనా, రష్యాల మొదటి సమావేశంగా విశ్లేషకులు అభిప్రాయపడినట్టు పేర్కొంది. 'ఇది పలు సందేశాలు పంపింది.. జిన్‌పింగ్, పుతిన్ మధ్య ఉన్న స్నేహం అమెరికాను సవాలు చేసే ప్రత్యామ్నాయ ప్రపంచ వ్యవస్థ నాయకులుగా వారి మధ్య సన్నిహిత బంధాన్ని తెలియజేసేలా ఉంది... డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సుంకాలతో భారత్‌ను దూరం చేసుకోవాలనుకుంటే వారికి చైనాతో సహా మిగతా స్నేహితులు ఉన్నారు' అని న్యూయార్క్ టైమ్స్ వ్యాఖ్యానించింది.





# దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాల లో ఘనంగా గురుపూజోత్సవం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5, తెలంగాణ ముచ్చట్లు:**

దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు గురుపూజోత్సవం దినోత్సవాన్ని విశేష ఉత్సాహంతో, అద్భుతమైన వేడుకలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యా సంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ ని, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య ని, అలాగే కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్న విభాగాధిపతులు ఏవో చిరంజీవి, ప్రియాంక, మానస, రాజ్, నవీన్ లను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దరిపల్లి విద్యాసంస్థల అధినేత మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ "గురువు అనేది విద్యార్థుల జీవితాన్ని మార్చగల శక్తి" అని పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ ఆలోచనలను స్మరించుకుంటూ, గురువుల యొక్క త్యాగం, కృషి, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో వారి పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలసి పాల్గొని వేడుకను మరింత గౌరవప్రదంగా మార్చారు. ఉత్సాహభరితమైన వాతావరణంలో గ్రూప్ దినోత్సవం విజయవంతంగా ముగిసింది.

# ఏఐ వీడియోతో పిల్లలను దారిలో పెట్టిన తల్లి







పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలంటే తల్లి తర్వాతే ఎవరైనా. ఒకప్పటి కాలం అయితే పిల్లలు మాట వినకపోతే నాలుగు తగిలించేవారు. ఇప్పుడు కాలం మారింది. ఈకాలం పిల్లలను కొడితే ఊరుకోరు.ఇంకా మొండికేస్తారు. వాళ్లకు చెప్పే రీతిలో చెబితే వింటారు. అలా చెప్పే టెక్నిక్స్ కూడా అందరికి తెలియవు. పైగా ఇది ఏఐ జనరేషన్. దాన్ని వాడుకుని.. అద్భుతాలు క్రియేట్ చేస్తున్నారు కొందరు. అదలా ఉంచితే ఏఐతో పిల్లలను క్రమశిక్షణలో పెట్టడానికి ఓ మహిళ వాడిన టెక్నిక్ ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది. ఆ వివరాలు.. ఇంట్లో ఒక్కరిద్దరూ పిల్లలు ఉంటేనే వారి అల్లరిని కట్టడి చేయలేం. అదే ఓ నలుగురు ఉంటే వారి పరిస్థితి.. పాపం వర్ణించడానికి మాటలు చాలవు. ఇక నేటి కాలంలో మహిళలు కూడా ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి. అటు జాబ్.. ఇటు ఇంటి నిర్వహణ.. రెండు పనులతో అలసి పోతుంటారు. దీనికి తోడు ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే.. వారు ప్రతి దాన్ని లాగి కిందపడేస్తారు. బొమ్మలు ఇల్లాంతా పరుస్తారు. వాటన్నింటిని సర్దడం అంటే మామూలు విషయం కాదు. పిల్లలను హెల్ప్ చేయమంటే అస్సలు వినరు. మరి అలాంటి పిల్లలను మాట వినేలా చేయాలంటే ఏం చేయాలి.. ఇదుగో ఈ మహిళ వాడిన టెక్నిక్ వినియోగించాలి.ఇప్పుడు మనం చెప్పుకోబోయే మహిళకు నలుగురు సంతానం. ఇక అంత మంది పిల్లలు ఉంటే ఇల్లు కిష్కిందే అవుతుంది. ఆ మహిళ పరిస్థితి కూడా అందుకు ఏమాత్రం విరుద్ధం కాదు. అయితే పిల్లల అల్లరిని వారి చేతనే సెట్ చేయించడానికి ఆ మహిళ ఏఐని వాడుకుంది. పిల్లలు ఇంట్లో అల్లరి చేసి.. ఇంటిని చెత్త చెత్తగా ఎలా మార్చారో వీడియో తీసింది. తర్వాత దాన్ని ఓ న్యూస్ చానెల్‌లో టెలికాస్ట్ అవుతున్నట్లు ఏఐ వీడియో క్రియేట్ చేసింది. పిల్లలు టీవీ చూస్తుండగా వారి దగ్గరకు వెళ్లింది. ఆ తర్వాత టీవీలో న్యూస్ టెలికాస్ట్ అయ్యింది. దీనిలో ఓ యాంకర్ పిల్లల అల్లరి గురించి చెబుతున్నట్లు టెలికాస్ట్ అయ్యింది. వారు ఇంటిని ఎంత చిందరవందరగా మార్చారో.. అదంతా రికార్డ్ అయ్యిందని.. న్యూస్‌లో వస్తుందని.. వీరి అల్లరిని ప్రపంచం అంతా చూస్తుందని పిల్లలను నమ్మించలగింది. ఇంకేముందు.. న్యూస్‌లో తమ అల్లరి.. ఇంటిని చెత్త చెత్తగా మార్చిన విధానం చూసిన పిల్లలు.. పరుగున వారి గదికి వెళ్లీ క్లీన్ చేసే పనిలో పడ్డారు. పిల్లల్లో వచ్చిన మార్పు చూసి తల్లి సంతోషపడిరది. ఈ మొత్తం తతంగాన్ని వీడియో తీసి ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో ఇది కాస్త వైరల్‌గా మారింది. ఈ ఐడియా పని చేసింది అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన వీడియో తెగ వైరల్ అవుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## రూ.8 కోట్ల లగ్జరీ నౌక.. ప్రారంభించిన కాసేపటికే మునక

ఈమధ్య కాలంలో మన దగ్గర వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన బ్రిడ్జీలు, ఫ్లైఓవర్లు, రోడ్లు.. రోజులు, గంటల వ్యవధిలోనే కూలిపోతుండటం చూస్తున్నాం. ఇలాంటి సంఘటనలు తెర మీదకు వచ్చినప్పుడు ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి మీద విమర్శలు చేస్తాం. ఇదిలా ఉంచితే తాజాగా ఓ వింత సంఘటన వెలుగులోకి వచ్చింది. కోట్ల రూపాయల విలువైన ఓ లగ్జరీ నౌక .. ప్రారంభించిన కొన్ని నిమిషాలకే సముద్రంలో మునిగిపోవడం సంచలనంగా మారింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో వైలర్‌గా మారింది. ఆ వివరాలు.. ఈ సంఘటన ఉత్తర టర్కీ తీరంలో వెలుగు చూసింది. జోంగుల్డాక్ తీరంలోని మెడ్ ఇల్మాజ్ షిప్‌యార్డ్‌లో ఈ నౌకను ఏర్పాటు చేశారు. దీని నిర్మాణం కోసం 1 మిలయన్ డాలర్లు అంటే మన కరెన్సీలో చెప్పాలంటే రూ.8.74 కోట్లు ఖర్చు చేశారు. రెండు రోజుల క్రితం అనగా మంగళవారం నాడు ఈ నౌక ప్రారంభం అయ్యింది. ఆ సమయంలో నౌకలో కొందరు ప్రయాణికులు, సిబ్బంది కూడా ఉన్నారు. లగ్జరీ నౌకలో ప్రయాణం చేస్తున్నామని మురిసిపోయినంత సేపు పట్టలేదు అది మునిగిపోవడానికి. ప్రారంభమైన 15 నిమిషాలకే ఈ నౌక మునిగిపోయింది. నౌక మునుగుతున్నట్లు అర్థం అయిన వెంటనే దానిలో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది సముద్రంలోకి దూకేశారు. అదృష్టం బాగుండి వారంతా క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. అయితే నౌక మునిగిపోవడం చూసి దాని యజమాని, కెప్టెన్ తీవ్ర నిరాశకు గురయ్యారు. అయినా చేసేదేం లేక వారు కూడా సముద్రంలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. ప్రస్తుతం అందరూ సురక్షితంగా ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. న్యూయార్క్ పోస్ట్ ప్రకారం.. ఈ నౌక ఇస్తాంబుల్ నుంచి దాని యజమానికి డెలివరీ అయింది. అయితే ప్రారంభించిన కాసేపటికే నౌక మునిగిపోవడంపై ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నామని దాని యజమాని తెలిపారు. నౌక మునిగిపోతున్న వీడియో వైరల్ కావడంతో దీనిపై నెటిజనులు రకరకాలుగా స్పందిస్తున్నారు. ఇది ఏఐ వీడియో అనుకుంటాను.. ఇంత ఖరీదైన నౌక అలా ఎలా మునిగిపోయింది.. అసలేం జరిగిందో ఎవరైనా చెప్పగలరు అంటూ ఇంకొకరు కామెంట్ చేశారు. అయితే నౌక మునిగిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియలేదన్నారు. దీనిపై త్వరలోనే విచారణ చేపడతామని వెల్లడిరచారు. కోట్ల రూపాయల ఖరీదైన నౌక ఇలా నీటిపాలవ్వడం మాత్రం కాస్త బాధ కలిగించే అంశమనే చెప్పాలి.



## ట్రంప్ సంచలన వ్యాఖ్యలు..

### భారత్‌పై ఇంకా పూర్తి స్థాయిలో ఆంక్షలు విధించలేదు

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అక్కసుగా భారత్ మీద సుంకాలతో విరుచుకుపడుతున్న ట్రంప్.. తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఇంకా భారత్ మీద పూర్తి స్థాయిలో ఆంక్షలు విధించలేదని చెప్పుకొచ్చారు.ఇప్పటికి కేవలం సెకండరీ టారిఫ్‌లను మాత్రమే విధించానని.. ఇంకా 2,3 విడతలను చేపట్టలేదని తెలిపారు. ఇప్పటికే భారత్ మీద 50 శాంత సుంకాలతో మోత మోగిస్తున్న ట్రంప్.. త్వరలోనే సేవల విభాగంపై టారిఫ్‌లు విధించేందుకు రెడీ అవుతున్నారు. వాణిజ్యపరంగా ఇండియా మీద మరింత ఒత్తిడి పెంచేందుకు ట్రంప్ అనుకూలంగా ఉన్న అన్ని మార్గాలను వినియోగించుకుంటున్నారు. ఇప్పటికే భారత్ ఎగుమతుల మీద భారీగా సుంకాలు విధించిన ట్రంప్.. ఇప్పుడు ఇండియన్ ఐటీ సేవలు, విదేశీ రిమోట్ వర్కర్ల మీద కూడా సుంకాలు విధించనున్నారు. తాజాగా అమెరికా ట్రేడ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ సలహాదారు పీటర్ నవారూ మాట్లాడుతూ.. అన్ని ఔట్‌సోర్సింగ్ సర్వీసుల మీద కూడా టారిఫ్ విధించాలి అని అభిప్రాయపడటం ఈ వాదనలకు బలం చేకూరుస్తోంది. భారత్ మీద సుంకాల మోత మోగిస్తున్న ట్రంప్.. తిరిగి ఇండియా మీదే విమర్శలు చేయడం గమనార్హం. ఇండియా టారిఫ్‌లతో అమెరికాను చంపేస్తుంది అన్నారు. అలానే చైనా, బ్రెజిల్‌లు కూడా సుంకాలతో అమెరికాను చంపేస్తున్నాయని ఆరోపించారు. ఇండియా అత్యధిక సుంకాలు విధించే దేశం. అలాంటిది ఇప్పుడు తన విధానాలకు భయపడి.. సుంకాలను పూర్తి రద్దు చేస్తామంటూ ముందుకు వచ్చింది. ఒక వేళ అమెరికా టారిఫ్‌లను విధించకపోతే భారత్ ఎప్పటికి ఇలాంటి నిర్ణయం తీసుకునేది కాదని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. భారత్.. అమెరికా మీద అత్యధిక సుంకాలను విధించింది. దీనివల్ల అమెరికా.. ఇండియాతో ఎక్కువగా వ్యాపారం చేయలేకపోయింది. కానీ భారత్ మాత్రం అమెరికాతో బాగానే వ్యాపారం చేసింది. అయినా మనం ఇండియా మీద సుంకాలు విధించలేదు. దీంతో భారత్ నుంచి ఉత్పత్తులు వరదలా వచ్చిపడ్డాయి అని చెప్పుకొచ్చారు.





## బీసీ రిజర్వేషన్లకు అడ్డు వస్తే ప్రళయమే

- బీసీ రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అమలు చేయాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5, తెలంగాణ ముచ్చట్లు:**

బీసీ రిజర్వేషన్లకు అడ్డు వస్తే ప్రళయమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడేపల్లి కృష్ణమాచారి లు అన్నారు. ఖమ్మం నగరంలోని ఖానాపురంలో శుక్రవారం జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ సంఘం జిల్లా అద్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి లు మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ లాగా అడ్డుకుంటే రాష్ట్రంలో ప్రళయం సృష్టిస్తామని హెచ్చరించారు. జనాభాలో 56శాతం ఉన్న ప్రజలకు న్యాయం చేయటం కోసం అందరూ సహకరించాలన్నారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఏ రాజకీయ పార్టీని వదిలిపెట్టమని, ఆ పార్టీలను బీసీలకు శాశ్వతంగా దూరం చేస్తామని, బీసీల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. సంఘ నిర్మాణ కోసం ప్రతి బీసీ బిడ్డ ముందుకు రావాలని, ఫీజు రియంబర్స్మెంట్ ను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయాలని లేకుంటే భవిష్యత్తులో పేద విద్యార్థులకు ఇబ్బందులు ఉంటాయన్నారు. బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య ఉద్యోగ రంగాల్లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మసనం శివరామకృష్ణను జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ.. తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నిక చేసిన జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్యనిర్వాహక అధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేశారు. వారు ఏ కార్యక్రమం తలపెట్టిన విజయవంతం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు, నగర అధ్యక్షులు గద్దె వెంకటరామయ్య, సీనియర్ నాయకులు బొడ్డు కృష్ణ, మోడేపల్లి వెంకటాచారి, ఎనుముల రాము యాదవ్, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు రచ్చ శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు, పులిపాటి సంపత్, గుడ్ల శ్రీను, దరిపల్లి సాంబయ్య, చందా వీరభద్రం, అమృతం మల్లికార్జున్, కమర్థపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.





## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశ ప్రజలకు జీఎస్టీ విషయంలో తీపి కబురు అందించిన సందర్భంగా సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు బాణోతు విజయ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బోస్ బొమ్మ సెంటర్లో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవి రమేష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద మరియు మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకుందని అన్నారు. పేద ప్రజలు వినియోగించే వస్తువులపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయడం, మధ్యతరగతి ప్రజలు వినియోగించే వస్తువులపై 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం, 28 శాతం పన్ను ఉన్న వస్తువులపై 18 శాతానికి తగ్గించడం ద్వారా ప్రజలకు పెద్ద ఉపశమనం కలిగిందని వివరించారు. విద్యారంగం, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్న వస్తువులపై కూడా జీఎస్టీ ఎత్తివేయడం, క్యాన్సర్ రోగులకు అవసరమైన మందులపై జీఎస్టీ తగ్గించడం ఎంతోముఖ్యమైన నిర్ణయమని అన్నారు.

ఇంతటి ప్రజల పక్షపాతక నిర్ణయాలు తీసుకున్నందుకు ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు సత్తుపల్లి నియోజకవర్గం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాజీ మట్ట ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి, పరసా రాంబాబు, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి మంద శివయాదవ్, వేంసూర్ మండల అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి, మాదిరాజ్ శ్రీనివాస్, మెరుగు శేషగిరిరావు, లక్ష్మి, శారద, సత్యవతి, దుర్గా రాణి, సాయి వర్ధన్, బండి ఆంజనేయులు, ఆచంటి సుబ్రహ్మణ్యం, నాగరాజు, గణేష్, కార్తీక్ యాదవ్, సాయి, పాకనాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.







## ఆర్టీసీ మనకు అమ్మ లాంటిది.!

- ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలి.
- సత్తుపల్లి డిపోలో జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. సోలోమన్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):**

సత్తుపల్లి ఆర్టీసీ డిపోను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. సోలోమన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రీజియన్ మేనేజర్ ఏ. శరీరంతో కలిసి డిపో ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం గ్యారేజ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కరోనా సమయంలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ సమిష్టి కృషితో ఆర్టీసీ డిపోలు లాభాల బాటలో నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ వారిని గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చుతున్న సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఆర్టీసీ సంస్థను "అమ్మ" లాగా భావించి ఉద్యోగులంతా అన్నదమ్ముల్లా కలసి ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

1992లో విధుల్లో చేరిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, ఆర్టీసీ అప్పట్లో ప్రజల రవాణాకు ప్రధాన ఆధారంగా ఉండేదని, ప్రైవేట్ వాహనాల రాకతో కష్టాలు ఎదుర్కొన్నామని తెలిపారు. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం సంస్థకు కొత్త ఊపునిచ్చిందని, రోజుకు 35 నుంచి 50 లక్షల మంది రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని వివరించారు. పండగలు, ట్రాఫిక్ సీజన్‌లో అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మహిళలకు మహాలక్ష్మి పథకం వరం లాంటిదని, అదే సమయంలో డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ బస్సులను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో అనేక అవార్డులు అందుకున్న సత్తుపల్లి డిపో అభివృద్ధి పథంలో ముందంజలో ఉందని ప్రశంసించారు.

ఈ సందర్భంగా శ్రీరామనవమి ముత్యాల తలంబ్రాల బుకింగ్‌లో రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచిన కార్గో ఎగ్జిక్యూటివ్ మునీర్ పాషా, విలేజ్ బస్ ఆఫీసర్ ఆనందరావు, డ్రైవర్ జయపాల్‌లను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఆర్ఎం ఏ. సాయిరాం, డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య, డిపో మేనేజర్ రాజలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పి. విజయశ్రీ, ఎం.ఎఫ్. సాహితి, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఎన్నికలు, ట్రంప్ టారిఫ్‌ల ప్రభావమే

న్యూఢల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు స్వాగతించదగినవే. కానీ చాలా ఆలస్యంగా చేపట్టినట్లు కేంద్ర మాజీఆర్థికమంత్రి పి. చిదంబరం వ్యాఖ్యానించారు. బీహార్ ఎన్నికలు, ట్రంప్ విధించిన సుంకాల నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు చేపట్టినట్లు తెలుస్తుందని చిదంబరం అన్నారు. బుధవారం ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం



పాదరక్షలు, దుస్తులపై జిఎస్‌టి రేటును 5 శాతానికి తగ్గించడానికి ఆమోదం తెలిపింది. అలాగే రెండు పన్ను రేట్లు 5 శాతం,18 శాతం శ్లాబులకే ఎక్కువ వస్తువులను తేవాలని, 12 శాతం, 28 శాతం శ్లాబులను తొలగించాలని ఈ కౌన్సిల్ ప్రతిపాదించింది. జీఎస్టీ శ్లాబులను తగ్గించడంపై కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం స్వాగతించారు. కానీ ఎన్డీఏ సర్కార్ చేపట్టిన నెక్ట్స్ %% జెన్ పేరిట తేబోతున్న జీఎస్టీ సంస్కరణలు చాలా ఆలస్యమయ్యాయని ఆయన అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం 8 సంవత్సరాలు ఆలస్యంగా ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, ‘గత ఎనిమిది సంవత్సరాల జీఎస్టీ రూపకల్పపై వ్యతిరేకిస్తున్నాము. జీఎస్టీపై మేము ఎంత అరిచి చెప్పినా.. ప్రయోజనం లేదు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఈ మార్పులు చేపట్టడమే ఆశ్చర్యంగా ఉంది. వృద్ధి మందగించడం? గృహవినియోగదారుల రుణం పెరగడం? వారి పొదుపు తగ్గడం? బీహర్‌లో ఎన్నికలు? ట్రంప్ టారిఫ్‌లు ఇన్నింటి నేపథ్యంలో జీఎస్టీ సంస్కరణలు తెస్తున్నట్టు అర్థమౌతుందని చిదరంబరం పేర్కొన్నారు.



## బెంగళూరు, పూణేలో ఆపిల్ కొత్త స్టోర్లను ప్రకటించిన సీఈఓ టిమ్ కుక్

ప్రముఖ సెల్ ఫోన్ బ్రాండ్ ఆపిల్... ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న కంపెనీ. దీని నుంచి ఏ కొత్త మోడల్ మొబైల్ వచ్చినా.. హాట్ కేకుల్లా అమ్ముడు పోతుంటాయి. ఈ ఆపిల్ ఫోన్ ను కలిగి ఉండటాన్ని చాలామంది ప్రెస్టేజ్ గా తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆపిల్ ఫోన్ల వినియోగం భారత్ లో భారీగా పెరిగిపోయింది. ఈ క్రమంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బదులుగా ఆ కంపెనీ నేరుగా ఇండియాలోని ప్రముఖ పట్టణాల్లో స్టోర్ లను ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా మొదట ముంబైలో ఏర్పాటైన యాపిల్ స్టోర్లు (యాపిల్ స్టోర్లు) నెమ్మదిగా దేశం మొత్తం విస్తరిస్తున్నాయి. తాజాగా.. ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ భారతదేశంలో బెంగళూరు, పూణే లో రెండు కొత్త ఆపిల్ స్టోర్లను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రారంభంతో, ఆపిల్ ఇప్పుడు దేశంలో నాలుగు అధికారిక స్టోర్లను కలిగి ఉంది. మొదటి రెండు ముంబైలోని ఆపిల్ %దీఖజ%, ఢిల్లీలోని ఆపిల్ సాకేత్, తర్వాత బెంగళూరులో కొత్తగా ప్రకటించిన ఆపిల్ హెబ్బాల్, పూణేలోని ఆపిల్ కోరెగావ్ పార్క్ ఉన్నాయి. ఈ ప్రకటన తర్వాత కుక్ మాట్లాడుతూ, ''బెంగళూరులోని ఆపిల్ హెబ్బాల్, పూణేలోని ఆపిల్ కోరెగావ్ పార్క్‌లకు హలో చెప్పండి! ఈ రెండు కొత్త స్టోర్లలో భారతదేశం అంతటా కస్టమర్లకు ఆపిల్ యొక్క ఉత్తమమైన మొబైల్స్ అందించడం కొనసాగించడానికి మేము సంతోషిస్తున్నాము'' అని ఆపిల్ సీఈఓ చెప్పుకొచ్చారు.

# 16 పైసల నుంచి రూ. 41 కి పెరిగిన షేర్ ధర..



స్టాక్ మార్కెట్లలో కొన్ని స్టాక్స్ అద్భుతం చేస్తుంటాయి. ఊహించని రీతిలో అనతి కాలంలోనే పెరుగుతూ కాసుల పంట పండిస్తుంటాయి. అయితే ఇక్కడే మనం ఏ స్టాక్ ఎప్పుడు ఎందుకు పెరుగుతుందో అంచనా వేయగలగాలి.ఇందు కోసం.. స్టాక్ మార్కెట్లను జాగ్రత్తగా పరిశీలిస్తుండాలి. ఏదో ఎవరో చెప్పారని గుడ్డిగా నమ్మి ఇన్వెస్ట్ చేయవద్దు. నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం. మరీ ముఖ్యంగా ఆయా కంపెనీల నుంచి వచ్చేటువంటి ప్రకటనలు, ఫలితాలు, పెట్టుబడి వ్యూహాలు ఇలా అన్నింటినీ పరిశీలిస్తూ జాగ్రత్తగా పెట్టుబడి చేయాల్సి ఉంటుంది.ఇంకా స్టాక్ మార్కెట్లలో షార్ట్ టర్మ్ కంటే.. దీర్ఘకాలం మంచి రిటర్న్స్ వస్తుంటాయన్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఆయా కంపెనీలు ప్రకటించే బోనస్ షేర్లు, స్టాక్ స్ప్లిట్, డివిడెండ్ ఇలా పలు కారణాల వల్ల అదనపు లాభాలు ఉంటాయని చెప్పొచ్చు. అందుకే వీటిని పరిగణనలోకి తీసుకోవడం మంచిది.ఇప్పుడు మనం.. దీర్ఘ కాలంలో ఇన్వెస్టర్ల సంపదను భారీగా పెంచిన ఒక స్టాక్ గురించి తెలుసుకుందాం. అదే హజూర్ మల్టీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్. ఇటీవలి కాలంలో స్టాక్ మార్కెట్లో ఎన్ని ఒడుదొడుకులు ఉన్నప్పటికీ ఈ స్టాక్ రాణించింది. ఈ కంపెనీను నమ్ముకొని ఇన్వెస్ట్ చేసి హోల్డ్ చేసిన వారికి కాసుల వర్షం కురిపించింది. ఈ స్టాక్ ధర ఒకప్పుడు పైసల్లో ఉండేది. అక్కడినుంచి భారీగా పెరిగిందని చెప్పొచ్చు. 2015 సెప్టెంబర్ నెలలో.. కేవలం 16 పైసలుగా ఉన్న షేరు ధర.. అక్కడినుంచి ఏటా మల్టీ బ్యాగర్ రిటర్న్స్ ఇస్తూ వచ్చింది. ఇప్పుడు దీని ధర రూ. 41.40 వద్ద ఉంది. ఈ క్రమంలో.. అప్పుడు స్టాక్ కొనుగోలు చేసిన వారికి కళ్లుచెదిరే రాబడి ఇచ్చింది. అంటే 10 సంవత్సరాల కిందట ఇందులో ఒకేసారి రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు రూ. 2.59 కోట్లు వచ్చాయి. 2024లో ఈ కంపెనీ 1:10 రేషియోలో బోనస్ షేర్లు ప్రకటించింది. అంటే ఇన్వెస్టర్ దగ్గర 10 ఈక్విటీ షేర్లు ఉంటే.. వారికి దానిపై ఒక్కో షేరు ఉచితంగా లభించేది. దీని వల్ల స్టాక్ ధర తగ్గి మరింత అందుబాటులోకి వచ్చింది. గురువారం సెషన్.. ఈ స్టాక్ ధర స్వల్పంగా పెరిగి రూ. 41.40 వద్ద స్థిరపడిరది. గత ఐదేళ్లలో మరింత ఎక్కువగా ఏకంగా 41,130 శాతం పెరిగినా.. ఏడాది నుంచి చూస్తే పడిపోతోంది. ఏడాదిలో ఈ స్టాక్ 17 శాతం తగ్గింది. నెలలో 10 శాతం, 6 నెలల్లో 20 శాతం పతనమైంది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 63.90 కాగా.. కనిష్ఠ ధర రూ. 32 గా ఉంది. ఇక కంపెనీ మార్కెట్ విలువ చూస్తే రూ. 948.78 కోట్లుగా ఉంది.

## జీఎస్టీ 2.0 సంస్కరణలు వినియోగ ఆధారిత వృద్ధికి చోదక శక్తి



జీఎస్టీ కౌన్సిల్ తాజా రేట్ల తగ్గింపు ప్రకటించిన నేపథ్యంలో ఆ మేరకు పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ గురువారం ప్రకటనలో తెలిపారు. కంపెనీ రిటైల్ విభాగంలోని అన్ని వస్తువులపై వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) రేట్ల తగ్గింపును అమలు చేయనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కేంద్రం తీసుకున్న జీఎస్టీ 2.0 సంస్కరణలను ముఖేష్ అంబానీ ప్రశమించారు. ఈ చర్యలు వినియోగ ఆధారిత వృద్ధికి చోదక శక్తిగా అభివర్ణించారు. జీఎస్టీ హేతుబద్ధీకరణ వల్ల వినియోగదారులకు ఉత్పత్తులు, సేవలు మరింత సరసమైనవిగా మారుతాయని, వ్యాపారాలకు కూడా నిర్వహణలోని సంక్లిష్టతను తగ్గిస్తాయని అన్నారు. పన్ను తగ్గింపు ఫలితంగా రిటైల్ రంగంలో వినియోగాన్ని పెంచేందుకు ఉత్ప్రేరకంగా ఉంటుందని, ముఖ్యంగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టేందుకు ఇది కీలకమని అంబానీ తెలిపారు. పన్ను తగ్గింపును వినియోగదారులకు అందించేందుకు రిలయన్స్ రిటైల్ కట్టుబడి ఉందని రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ అన్నారు. ఈ సంస్కరణల ప్రయోజనాలను కస్టమర్లకు పారదర్శకంగా, తక్షణం అందేలా చూస్తామని ఆమె పేర్కొన్నారు.





## ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్‌బ్యాంక్ వాటా తగ్గింపు

ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్‌లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ 2.15 శాతం వాటాలను విక్రయించింది. దీంతో సాఫ్ట్‌బ్యాంక్ తన హోల్డింగ్ వాటాను 17.83 శాతం నుంచి 15.68 శాతానికి కుదించుకుందని ఓలా ఎలక్ట్రిక్ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. జూలై 15 నుండి సెప్టెంబర్ 2 మధ్య జరిగిన వరుస విక్రయాల్లో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్‌లోని కొన్ని ఈక్విటీ షేర్లను విక్రయించిందని పేర్కొంది. 2025 జూన్ 30 నాటికి ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్ బ్యాంక్ 17.83 కోట్ల షేర్లను కలిగి ఉంది. ఇది 78.65 కోట్ల ఈక్విటీ షేర్లలో 17.83 శాతం వాటాకు సమానం. మార్కెట్ల ముగింపునకు కొద్ది సేపు ముందు ఓలా ఈ విషయాన్ని వెల్లడిరచింది. మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 7 శాతం పతనమై రూ.64.49 వద్ద ముగిశాయి. 350సిసి లోపు ఇంజన్ సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాలపై జిఎస్‌టిని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం ఓలా ఎలక్ట్రిక్ షేర్లపై ఒత్తిడిని పెంచింది.

## స్వల్ప లాభాల్లో కొనసాగుతోన్న స్టాక్ మార్కెట్లు

దేశీయ మార్కెట్లు శుక్రవారం స్వల్ప లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుతున్నప్పటికీ.. మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ ఉదయం ఉత్సాహంగా ప్రారంభమైన సూచీలు.. తర్వాత ఆ జోరు తగ్గించాయి.ఈ ఉదయం సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభంతో, నిఫ్టీ 24,800 మార్క్ పైన ట్రేడిరగ్‌ను మొదలుపెట్టాయి. అయితే, కాసేపటికే లాభాల్లో కొంత ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ 193.34 పాయింట్ల లాభంతో 80,911.35 వద్ద, నిఫ్టీ 55.45 పాయింట్లు పెరిగి 24,789.75 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 88.13గా కొనసాగుతోంది. జపాన్‌పై ఆటో టారిఫ్‌లను 27.5 శాతం నుంచి 15శాతానికి తగ్గిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఈ పరిణామంతో ఆసియాపసిఫిక్ మార్కెట్లు శుక్రవారం సానుకూలంగా ట్రేడ్ అవుతున్నాయి. జపాన్ నిక్కీ 1.39శాతం, దక్షిణ కొరియా కోస్పి 0.26శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 0.58శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 0.17శాతం మేర లాభంతో కొనసాగుతున్నాయి. అటు అమెరికా మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. ఎస్అండ్‌పీ సూచీ 0.83శాతం, నాస్‌డాక్ 0.98శాతం, డోజోన్స్ 0.77శాతం మేర పెరిగాయి.





## సిమెంట్, స్టీల్‌పై జీఎస్టీ తగ్గింపుతో దిగిరానున్న ఇంటి నిర్మాణ ఖర్చులు

సిమెంట్, స్టీల్ సహా ఇతర వస్తువులపై జీఎస్టీ తగ్గించాలన్న కౌన్సిల్ నిర్ణయాన్ని రియల్ ఎస్టేట్ డెవలపర్లు స్వాగతించారు. ఇది గృహ కొనుగోలుదారుల విశ్వాసాన్ని పెంచుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సిమెంట్‌పై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం వల్ల నిర్మాణ ఖర్చులు నేరుగా తగ్గుతాయని, గృహనిర్మాణాలు మరింత సరసమైనవిగా మారుతాయని భావిస్తున్నారు. ప్రధానంగా సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిపై జీఎస్టీని తగ్గించడం వల్ల నిర్మాణ ఖర్చులు 35 శాతం వరకు తగ్గుతాయి. డెవలపర్లు, ముఖ్యంగా సరసమైన గృహాల నిర్మాణంలో ఉన్నవారు, నిధుల లభ్యత, మార్జిన్ల పరంగా భారీ ఉపశమనం పొందుతారని అనరాక్ రీసెర్చ్ తెలిపింది. అనరాక్ ప్రకారం, సరసమైన ఇళ్ల విభాగం (రూ. 40 లక్షల కంటే తక్కువ) మొత్తం ఇళ్ల అమ్మకాలలో 2019లో 38 శాతం నుంచి 2024లో 18 శాతానికి తగ్గింది. ఇలాంటి సమయంలో తగ్గిన పన్ను ప్రయోజనాలను బదిలీ చేస్తే ఈ విభాగంలో డిమాండ్ ఊపందుకుంటుందని అనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనుజ్ పురి అన్నారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో దాదాపు కోటి బడ్జెట్ ఇళ్ల కొరత ఉంది. ఇది 2030 నాటికి 2.5 కోట్లకు పెరగవచ్చు. తాజా జీఎస్టీ సంస్కరణలు నిర్మాణ ఖర్చులను తగ్గించడమే కాకుండా విధాన పరమైన సంక్లిష్టతలను కూడా తగ్గిస్తాయి. సిమెంట్, స్టీల్ లాంటి కీలకమైన నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం వల్ల ఇన్‌పుట్ ఖర్చుల భారం తగ్గుతుంది. ప్రాజెక్ట్ నిర్మాణాలు లాభదాయకతను పెంచేందుకు దోహదపడతాయి. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తుందని నారెడ్కో ఛైర్మన్ నిరంజన్ హీరానందాని అన్నారు.

## వినియోగదార్లకు జీఎస్‌టీ ప్రయోజనాలు..

జీఎస్‌టీ రేట్ల మార్పు వల్ల కలిగే పూర్తి ప్రయోజనాలను వినియోగదార్లకు కచ్చితంగా బదలాయించాలని పరిశ్రమకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి మంత్రి పీయూశ్ గోయల్ సూచించారు.స్వాతంత్ర్యం వచ్చాక.. అతి పెద్ద సంస్కరణ ఇదేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. జీఎస్‌టీ సంస్కరణల వల్ల దాదాపు అన్ని రంగాల్లోనూ గిరాకీ పెరుగుతుందని, తద్వారా ఆర్థిక వృద్ధికి మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. గురువారమిక్కడ జరిగిన మెడ్‌టెక్ ఎక్స్‌పో, ఐఫెక్స్ 2025, భారత్ న్యూట్రావర్స్ ఎక్స్‌పో 2025లో ఆయన మాట్లాడారు. 'వచ్చే రెండేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. 2047 కల్లా ప్రస్తుత 4 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ నుంచి 30 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుంది. జీఎస్‌టీ సంస్కరణలతో రైతు నుంచి ఎమ్ఎస్ఎమ్ఈల వరకు పలు రంగాలపై ప్రభావం కనిపిస్తుంది. దేశంలోని ప్రతీ వినియోగదారుకు లబ్ది చేకూరుతుంది. 140 కోట్ల మంది పౌరులకు నాణ్యమైన జీవితాన్ని ఈ దీపావళి కానుక ఇస్తుంద'న్నారు.

మేం బదిలీ చేస్తాం: దాదాపు ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలన్నీ వినియోగదార్లకు ప్రయోజనాన్ని బదిలీ చేస్తామని చెప్పాయి. మదర్‌డెయిరీ కూడా తమ అన్ని ఉత్పత్తులపై జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాలను బదిలీ చేస్తామని తెలిపింది. తోలు ఉత్పత్తులపై పన్ను రేటును 12% నుంచి 5 శాతానికి తగ్గించిన నేపథ్యంలో, రూ.1,000లోపు ఉత్పత్తులపై ఈ ప్రయోజనాన్ని గడువుకన్నా ముందే వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు బాటా తెలిపింది. 22 దాకా కొనుగోళ్లు ఆపాలా?: సబ్బుల నుంచి చిన్న కార్ల వరకు సుంకాలు తగ్గిన నేపథ్యంలో.. కారు కానీ టీవీ కానీ కొనాలంటే ఈ నెల 22 వరకూ ఆగాలా? అన్న అనుమానం రావొచ్చు. దీనిపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. 'చట్టప్రకారం.. 22 నుంచే ఇన్‌వాయిస్‌లలో సవరించిన జీఎస్‌టీ రేటు కనిపిస్తుంది. ఆ తేదీ తర్వాత పంపిణీదార్ల వద్ద ఏదైనా పెండిరగ్‌లో ఉన్నా కూడా రిటైలర్లు మాత్రం పాత రేటును ఛార్జ్ చేయలేరు. అయితే వినియోగదార్లు, తగ్గిన రేట్లను పరిశీలించుకుంటే మంచిద'ని చెబుతున్నారు. 21 వరకూ ప్రస్తుత రేట్లు ఉంటాయి కాబట్టి.. దాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.



## ట్రంప్ పాలన ఆసియా శక్తులను అణగదొక్కాలని చూస్తోంది..

చైనా వేదికగా జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలనపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఆసియాలోని రెండు అతిపెద్ద శక్తులు అయిన భారత్, చైనాలను అణగదొక్కేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. పుతిన్ వ్యాఖ్యానంలో, ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ టారిఫ్‌లు (ఆంక్షలు) అనే సాధనాన్ని ఆయుధంలా ఉపయోగిస్తోందన్నారు. ఇది ఆర్థిక ఒత్తిడి ద్వారా ఆయా దేశాలపై ప్రభావం చూపించాలనే వ్యూహంగా ఆయన పేర్కొన్నారు. తాము భాగస్వాములు అనే మాటలు చెప్పినా, ఆ చర్యలు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. భారత్, చైనాలు తమ స్వతంత్రతను నిలుపుకోవడంలో మరింత చురుకుగా ఉండాలని పుతిన్ సూచించారు. అమెరికా విధానాలు వీటిని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉన్నాయని ఆయన అభిప్రాయం. ప్రపంచంలో శాంతి, సమతుల్యతను కాపాడాలంటే ఇలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ఆ దేశాలు దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. పుతిన్ వ్యాఖ్యలు అమెరికాఆసియా దేశాల మధ్య కొనసాగుతున్న రాజకీయ, ఆర్థిక ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజా వేదికగా భారతదేశం, చైనా వంటి దేశాలకు మద్దతుగా నిలబడిన ఆయన, రష్యా తన భౌగోళిక, రాజకీయ ధోరణిలో స్పష్టత చూపుతోందని సూచించారు. ఇది భవిష్యత్తులో అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది.

## భారత్-ఈయూ సదస్సుపై యూరోపియన్ నేతలతో మోడీ చర్చలు

న్యూఢిల్లీ : తదుపరి భారత్-ఈయూ శిఖరాగ్ర సదస్సు గురించి యూరోపియన్ నాయకులతో ప్రధాని మోడీ గురువారం ఫోన్ ద్వారా చర్చించారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షులు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో ఈ చర్చలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'విశ్వాసం, భాగస్వామ్య విలువలు, భవిష్యత్‌పై ఏక ధృక్పథంపై నిర్మించబడిన బలమైన, సన్నిహిత సంబంధాన్ని ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య శక్తులు భారత్-ఈయూ పంచుకుంటాయి' అని ప్రకటన తెలిపింది. అలాగే గురువారం చర్చల్లో ప్రపంచ సమస్యలను సంయుక్తంగా పరిష్కరించడం, ప్రపంచ స్థిరత్వాన్ని పెంపొందించడం, పరస్పర శ్రేయస్సును ప్రోత్సహించడంలో భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం పాత్రను నాయకులు ప్రత్యేకంగా ప్రస్తావించారని ప్రకటన తెలిపింది. తదుపరి భారత్-ఈయూ శిఖరాగ్ర సదస్సును భారత్‌లో ముందస్తుగానే నిర్వహించడం గురించి ఈ చర్చలు జరిగాయి. మరిన్ని చర్చలు జరపడానికి నాయకులు అంగీకరించారు. అలాగే, ఈ సదస్సు కోసం నాయకులను మోడీ భారత్‌కు ఆహ్వానించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## హైప్ పెంచుతున్న హీరోయిన్ పోస్ట్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ చిత్ర శుక్ల 'దక్ష' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెడికల్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాలో మంచు లక్ష్మీ ప్రసన్న, సిద్ధిఖీ, కలెక్షన్ కింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహిత మోహన్ బాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డైమండ్ రత్నబాబు అందించిన కథతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వంశీ కృష్ణ మల్లా దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో విశ్వంత్, మహేష్, విరేన్, తంబి దొరై, సముద్రఖని, కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని మంచు ఎంటర్టైన్మెంట్స్, శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అచ్చు రాజమణి సంగీతం అందిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ మూవీ మేకర్స్ హీరోయిన్ చిత్ర శుక్ల పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో ఆమె 'మిథిలా' పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడిరచారు. ఇక ఈ విషయాన్ని తెలుపుతూ చిత్ర ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. "మిథిలా ముఖం అమాయకంగా కనిపిస్తుంది. కానీ మీరు తెలుసు అనుకున్న.. ప్రతి దాన్ని బద్దలు కొట్టే రహస్యాలతో ఆమె పాత్ర ఉండబోతుంది. ప్రపంచంలో సున్నితమైన స్వరంతో ఉంటుంది. కానీ ఆమె సైలెన్స్‌ను బలహీనతగా పొరపాటు పడకండి. నియమాలను తిరగరాయడానికి 'దక్ష' మీ ముందుకు వస్తోంది" అనే క్యాప్షన్ జత చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రేక్షకుల్లో హైప్ పెంచుతోంది.



## ఉత్తేజకరమైన అధ్యాయం ప్రారంభమవుతుంది..


టాలీవుడ్ స్టార్ హీరో రాజశేఖర్ కూతురిగా శివాత్మిక ఇండస్ట్రీకి పరిచయం అయింది. 'దొరసాని' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. ఇక ఆ తర్వాత పంచతంత్రం, కల్కి, ఆకాశం, రంగమార్తండ, వంటి మూవీస్ చేసింది. అంతేకాకుండా తమిళంలోనూ నటించి శివాత్మిక అనతి కాలంలోనే ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ప్రస్తుతం వరుస సినిమాలు అనౌన్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. శివాత్మిక త్వరలోనే 'బాంబ్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విశాల్ వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శివాత్మిక రాజశేఖర్, అర్జున్ దాస్ జంటగా నటించారు. దీనిని జెంబ్రియో పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఇందులో కాళి వెంకట్, నాసర్, అభిరామి, సింగంపులి, బాలా శరవణన్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా సెప్టెంబర్ 12న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, శివాత్మిక తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ కొత్త సినిమాను ప్రకటించింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా పూర్తైనట్లు వెల్లడిస్తూ ఫొటోలు షేర్ చేసింది. ఈ సినిమాలో శివాత్మిక '35 చిన్న కథ కాదు'తో హిట్ అందుకున్న విశ్వ దేవ్ రాచకొండ జత కట్టబోతున్నారు. అదిత్యమండల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం గోల్డ్ బాక్స్ బ్యానర్‌పై చిరు కూతురు సుస్మిత కొనిదెల నిర్మాణంలో రాబోతున్న 7వ ప్రాజెక్ట్ కావడం విశేషం. 'వరం' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ త్వరలోనే ప్రారంభం కాబోతుంది. ఈ విషయాన్ని తెలుపుతూ శివాత్మిక త్వరలోనే ఉత్తేజకరమైన అధ్యాయం ప్రారంభమవుతుందని తెలపడంతో నెటిజన్లు ఆమెకు కంగ్రాట్స్ చెబుతున్నారు. అలాగే హిట్ అందుకోవాలని కోరుతున్నారు.

# సంయుక్త వెరీ స్పెషల్..!



కన్నడ చిత్ర పరిశ్రమలో తన నటనతో గుర్తింపు పొందిన సంయుక్తా హొరనాడ్.. సినిమాలతో పాటు ప్రాణుల సంక్షేమం కోసం అద్భుతమైన పనులు చేస్తోంది. ఆమె స్థాపించిన 'ప్రాణా యానిమల్ ఫౌండేషన్' ద్వారా 4000 కంటే ఎక్కువ ప్రాణులను రక్షించి మానవత్వాన్ని చాటుతోంది. సంయుక్తా హొరనాడ్ 2007లో 'ఆ దినగలు' సినిమా నుంచి 2024లో వచ్చిన 'మార్క్స్' వరకు తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఐతే.. నటన తన జీవితంలో ఒక భాగం మాత్రమే. తన అసలైన అభిరుచి ప్రాణుల సంక్షేమం. ఈ దిశగా ఆమె చేస్తున్న పనులు సామాన్యులకు స్ఫూర్తిదాయకం. ఒకరోజు ఒక కాలవలో చిక్కుకున్న కుక్కపిల్లను చూసింది. ఆ పిల్లను రక్షించి 'గుండా' అని పేరు పెట్టి దత్తత తీసుకుంది. ఐతే.. కొంతకాలానికి అది చనిపోయింది. ఆ ఇన్సిడెంట్ తనలో ప్రాణుల పట్ల బాధ్యతను మరింత బలపరిచింది. 'ప్రాణా యానిమల్ ఫౌండేషన్' స్థాపించేలా ప్రేరేపించింది. సంయుక్త ప్రాణా అనిమల్ ఫౌండేషన్‌ను 2022లో స్థాపించింది. ఈ సంస్థ ప్రధాన లక్ష్యం వీధి ప్రాణులను రక్షించడం, పునరావాసం కల్పించడం, వాటికి ఇళ్లను సమకూర్చడం. బెంగళూరులోని కనకపుర రోడ్డు సమీపంలో ఈ సంస్థ ఒక పిల్లుల పునరావాస, దత్తత కేంద్రాన్ని నడుపుతోంది. వీధిలో తిరిగే, వదిలివేయబడిన పిల్లులకు చికిత్స, శస్త్రచికిత్స అనంతర సంరక్షణ, దత్తత సౌకర్యాలను అందిస్తుంది. ప్రాణా యానిమల్ ఫౌండేషన్ కేంద్రం 2025లో 7వ సీఎంఎస్బీ నేషనల్ అవార్డులలో 'బెస్ట్ యానిమల్ రైట్స్ ఎన్జీఓ'గా గుర్తింపు పొందింది. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 4000 కంటే ఎక్కువ ప్రాణులను రక్షించింది సంయుక్త.

## రజనీకాంత్ క్లాస్ తీసుకోవడం రైటే



ఇటీవలే చెన్నైలో సూపర్ స్టార్ రజనీకాంత్ ని కలుసుకున్న మంచు మనోజ్ తాను విలన్ గా చేసిన మిరాయ్ ట్రైలర్ ని ప్రత్యేకంగా చూపించారు. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో తిరిగాయి. ఈ సందర్భంగా రజని తనను తిట్టారని, సినిమాలు చేయకుండా ఏం చేస్తున్నావని క్లాస్ పీకారని చెప్పుకొచ్చారు మనోజ్. మోహన్ బాబుతో ఉన్న ఘాడమైన స్నేహం దృష్ట్యా ఫ్రెండ్ కొడుక్కి ఆ మాత్రం మంచి చెడ్డ చెప్పే హక్కు ఖచ్చితంగా తలైవర్ కు ఉంది. అందులోనూ మిరాయ్ లాంటి గ్రాండియర్ లో భాగమవ్వడం చూశాక ఖచ్చితంగా అలా చెప్పకుండా ఎలా ఉంటారు. ఆ విషయాన్ని మనోజ్ స్వయంగా ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. రజని అన్నారని కాదు కానీ మనోజ్ నిజంగానే కెరీర్ మీద సీరియస్ గా ఫోకస్ పెట్టాలి. భైరవం, మిరాయ్ లో విలన్ గా నటించినా సరే ఇప్పటికీ సోలో హీరోగా తనతో సినిమాలు తీసేందుకు నిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. ఇటీవలే ఒక అనౌన్స్ మెంట్ రాగా మరొకటి వచ్చే నెల రెడీ చేస్తున్నారు. మార్కెట్ పరంగా చూసుకుంటే మనోజ్ కు ఎప్పుడో పట్టు తగ్గింది. కానీ ప్రేక్షకుల్లో తన మీద ఉన్న సదభిప్రాయం, యూత్ లో ఉన్న గుర్తింపు అవకాశాలు వచ్చేలా చేస్తోంది. దాన్ని సరైన రీతిలో వాడుకోవడమే మిగిలింది. మిరాయ్ ఫాంటసీ సబ్జెక్టు కాబట్టి విలన్ కోణంలో చాలా పెద్ద స్కోప్ దక్కినట్టు ఇన్ సైడ్ టాక్. మంచు ఫ్యామిలీలో వరసగా సినిమాలు చేస్తున్న వాళ్ళు లేరు. మోహన్ బాబు చాలా సెలెక్టివ్ గా మారిపోయారు. విష్ణు కన్నప్ప కోసం చాలా కష్టపడ్డాడు కానీ ఆశించిన ఫలితం పూర్తి స్థాయిలో దక్కలేదు. కొత్త ప్రాజెక్టు ఇంకా అనౌన్స్ చేయలేదు. లక్ష్మి ప్రసన్న సైతం అడపాదడపా తప్ప కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మనోజ్ కొంచెం స్పీడ్ పెంచాల్సిన అవసరం చాలా ఉంది అసలే టాలీవుడ్ లో విలన్ల కొరత చాలా ఉంది. ఇక్కడి వాళ్ళు సరిపోక బాలీవుడ్ నుంచి భారీ రెమ్యునరేషన్లు ఇచ్చి దింపాల్సి వస్తోంది. మనోజ్ లాంటి వాళ్ళు ఊపందుకుంటే ఆ లోటు కొంతైనా తీరుతుంది. అందుకే రజనీకాంత్ క్లాస్ పీకడం రైటే.

## లెజెండరీ ఆలోచన వాడుకున్నారు కానీ

ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్ అన్నట్టుంది సుందరకాండ పరిస్థితి. రెండో వారంలోకి అడుగు పెట్టకముందే ఫైనల్ రన్ కు వచ్చేయడం ఎవరూ ఊహించలేదు. ఎందుకంటే ముందు రోజు వేసిన ప్రీమియర్ నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. పాయింట్ టిపికల్ గా ఉన్నా దర్శకుడు బాగానే ఎంటర్ టైన్ చేశాడని రివ్యూయర్లు స్పందించారు. కానీ అది కలెక్షన్లలో కనిపించలేదు. ప్రేక్షకుల అనాసక్తి స్పష్టంగా బయట పడిరది. సక్సెస్ మీట్లు చేసినా లాభం లేకపోయింది. విజయ యాత్రను ప్రకటించారు కానీ వాటి తాలూకు ఫోటోలు వీడియోలు బయట పెద్దగా కనిపించలేదు. దీంతో ప్రమోషన్లు ఆపేశారు. నిజానికి సుందరకాండలో తీసుకున్న పాయింట్ టాలీవుడ్ కు కొత్తది కానీ ఈ తరహా ట్రీట్ మెంట్ తో 35 సంవత్సరాల క్రితం ఒక సినిమా తీశారు. అదేంటో చూద్దాం. 1991. సుప్రసిద్ధ దర్శక నిర్మాత యష్ చోప్రా చాందిని లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత లమ్హే చేశారు. విపరీతమైన అంచనాల మధ్య డిజాస్టర్ అయ్యింది. కారణం కథే. అనిల్ కపూర్, శ్రీదేవి ప్రేమించుకుంటారు. కానీ శ్రీదేవి వేరే అతన్ని పెళ్లి చేసుకుని బిడ్డను కన్నాక భర్తతో సహా ప్రమాదంలో చనిపోతుంది. బ్రతికి బయట పడ్డ కూతురు పెద్దయ్యాక మరో శ్రీదేవి అవుతుంది. వయసులో చాలా వ్యత్యాసమున్న అనిల్ కపూర్ నే ఇష్టపడి అతని జీవితంలో అడుగుపెట్టాక స్టోరీ సుఖాంతమవుతుంది. దీన్ని ఆడియన్స్ జీర్ణించుకోలేకపోయారు. తండ్రి సమానుడైన హీరోని చనిపోయిన హీరోయిన్ కూతురు లవ్ చేయడం అంగీకరించలేదు. దీంతో ఫలితం సూపర్ ఫ్లాప్. సుందరకాండలో దీన్ని రివర్స్ చేశారు. కాలేజీలో సీనియర్ శ్రీదేవి విజయ్ కుమార్ ని ప్రేమించిన నారా రోహిత్ ఆమెను మిస్సవుతాడు.




## భగత్ సింగ్ వేగం బాగుందయ్యా

ఎప్పుడు ఏ సమయంలో పవన్ కళ్యాణ్ బిజీ అవుతారో తెలియదు కాబట్టి తనకిచ్చిన బంగారం లాంటి డేట్లను వృథా చేయకుండా దర్శకుడు హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ ని పరుగులు పెట్టిస్తున్నారు. ఈ ఏడాది విడుదల లేకపోయినా పోస్ట్ ప్రొడక్షన్ కి ఎక్కువ సమయం కేటాయించి ప్రమోషన్ల కోసం ప్రత్యేక ప్లానింగ్ లో ఉన్నట్టు ఇన్ సైడ్ టాక్. ఇటీవలే ఒక పాట షూట్ పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మొన్న పవన్ పుట్టినరోజుకి విడుదల చేసింది దాని స్టిల్లే. నిజానికి స్టెప్పుతో కూడిన చిన్న వీడియోని వదలాలనే ఆలోచన వచ్చిందట గాని ఓజి ఫీవర్ లో ఉన్న ఫ్యాన్స్ ని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక పోస్టర్ తో సరిపెట్టారు. ఇప్పుడు మరో సాంగ్ కోసం రంగం సిద్ధమైపోయింది. దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీలో శనివారం నుంచి దీని షూట్ మొదలుపెట్టబోతున్నట్టు సమాచారం. ఇందులో కూడా క్రేజీ నృత్య భంగిమలు ఉంటాయని తెలిసింది. హరీష్ శంకర్ ముందు పలు సవాళ్లున్నాయి. తేరి రీమేకనే ప్రచారం ఉస్తాద్ భగత్ సింగ్ హైప్ మీద తీవ్ర ప్రభావం చూపించింది. ఇప్పుడిది ఒరిజినల్ కథని ఆయన చెబుతున్నారు కానీ తెరమీద చూశాక తప్ప అభిమానులు నమ్మలేని పరిస్థితి. ఇదలా ఉంచితే హైప్ లో పీక్స్ ని చూసిన ఓజి తర్వాత వస్తున్న సినిమాని హరీష్ శంకర్ డైరెక్ట్ చేశారు. సో ఆ హిట్టుని హీటుని అదే రీతిలో కొనసాగించాలి. అందుకే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండేలా స్క్రిప్ట్ లో పలు మార్పులు చేసుకున్న హరీష్ శంకర్ మీద గబ్బర్ సింగ్ రేంజ్ విజయం ఇవ్వాల్సిన అతి పెద్ద బాధ్యత నెత్తి మీద ఉంది. ఇవి కాకుండా మిస్టర్ బచ్చన్ చేసిన గాయం పెద్దదే. రవితేజకో మర్చిపోలేని హిట్టు పడుతుందనుకుంటే పెద్ద డిజాస్టర్ దక్కింది.




## మరపురాని ప్రయాణం ముగిసింది..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్య పాండే, కార్తీక్ ఆర్యన్ కాంబినేషన్‌లో రాబోతున్న మూవీ 'తు మేరి మైన్ తేరా మైన్ తేరా తుమేరీ'. సమీర్ విద్వాన్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను ధర్మా ప్రొడక్షన్ బ్యానర్‌పై కరణ్ జోహార్, అదార్ పూనవల్లా, షరీన్, భూమిక తివారీ, అపూర్వ మెహతా, నిర్మిస్తున్నారు. ఇందులో నీనా గుప్తా కీలక పాత్రలో కనిపించబోతుంది. ఈ సినిమా భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 13న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, అనన్య పాండే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. 'తు మేరి మైన్ తేరా మైన్ తేరా తుమేరీ' షూటింగ్ పూర్తి అయినట్లు వెల్లడిరచింది. మరపురాని, సరదాగా నిండిన, సూపర్-ఫాస్ట్ రోలర్-కోస్టర్ రైడ్ 57 రోజుల ప్రయాణం ముగిసింది. మా టీమ్ లేకుండా ఈ ప్రయాణం సాధ్యం అయ్యేది కాదు. నాకు ఇష్టమైన షరీన్ మంత్రి, అరోరా కిషోర్ ఎనర్జీలు ముఖ్యమైనవి. అందుకే కరణ్ జోహర్, అపూర్వ మెహతా, అదార్ పూర్ణావాలా ఈ ప్రాజెక్ట్‌ను మరింత ప్రత్యేకంగా చేశారు. అద్భుతమైన కోస్టార్‌గా ఉన్నందుకు నా ప్రియమైన కార్తీక్ ఆర్యన్‌కు ధన్యవాదాలు. టిఎంఎంటిలో మీరు చేసిన పాత్రను మరెవరూ చేయలేరు. మీతో కలిసి పనిచేయడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుంది. పెద్ద తెరపై వారి మాయాజాలాన్ని చూడటానికి వేచి ఉండండి. కరణ్ శర్మకి ప్రత్యేక ధన్యవాదాలు. సినిమా విడుదలైన తర్వాత అతను అందరి కంటే ఎక్కువ క్రేజ్ సంపాదించుకుంటాడని నేను అనుకుంటున్నాను. మన ప్రపంచాన్ని అవిశ్రాంతంగా సజీవంగా తీసుకువచ్చి, రాత్రి పగలు అని తేడా లేకుండా పని చేసే ప్రతి ఒక్కరికీ థాంక్స్. మీరందరూ నవ్వడానికి, ప్రేమలో పడటానికి సిద్ధంగా ఉండండి. నేను వేచి ఉండలేను. థియేటర్లలో కలుద్దాం" అని రాసుకొచ్చింది. అలాగే సెట్ ఎంజాయ్ చేస్తున్న వీడియోను షేర్ చేసింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in